# నిత్ర తెలుగు వారి 20 పురాణములు

1. బ్రహ్మ పురాణం
2. పద్మ పురాణం
3. విష్ణు పురాణం
4. వాయు పురాణం
5. భాగవత పురాణం
6. నారద పురాణం
7. మార్కండేయ పురాణం
8. అగ్ని పురాణం
9. భవిష్య పురాణం
10. బ్రహ్మ వైవర్త పురాణం
11. లింగ పురాణం
12. వరాహ పురాణం
13. స్కంధ పురాణం
14. వామన పురాణం
15. కూర్మ పురాణం
16. మత్స్య పురాణం
17. గరుడ పురాణం
18. బ్రహ్మాండ పురాణం
19. శివ పురాణం
20. దేవి భాగవత పురాణం



## భక్తులకు విన్నపము

వేదవ్యాసుని అష్టాదశ పురాణాలు మరియు శ్రీ శివపురాణం, శ్రీ దేవి భాగవతంతో కలిపి 20 పుస్తకములు నిత్ర తెలుగు పంచాంగం వారు తెలుగు పాఠకులకు భక్తిపూర్వకంగా అందిస్తున్నారు. డాక్టర్ జయంతి చక్రవర్తి గారు ఒక్కొక్క పురాణాన్ని 130 పేజీలలో సాధారణ పాఠకునికి కూడా అర్థమయ్యే విధంగా సంక్షిప్తంగా, పూర్తి వ్యావహారిక భాషలో మీకు అందించారు. ఆస్తికవరులు ఈ పురాణాలను చదివి ఆధ్యాత్మిక సంపదను పెంపొందించుకొనగలరు.


నిత్ర 2021 క్యాలెండర్

Download Nithra Calendar Click Here

http://bit.ly/ntecpdf

వ్యాస మహర్షి రచించిన

# శ్రీ బ్రహ్మ పురాణం



వచనం.జయంతి చక్రవర్తి

నిత్ర 2021 క్యాలెండర్

Download Nithra Calendar Click Here

http://bit.ly/ntecpdf



# 3+ Million Downloads

తెలుగు లో No.1 క్యాలెండర్

# నిత్ర తెలుగు క్యాలెండర్

యాప్‌ను ఉపయోగించవలసినవారు
ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.
లేదా bit.ly/telugucalendar2020 ని
ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోగలరు.

- రోజు వీక్షణ / మాస వీక్షణ
- పంచాంగం
- శుభ ముహూర్తాలు
- దిన రాశి ఫలాలు
- పండుగలు మరియు సెలవు దినములు
- నోములు మరియు వ్రతాలు - 116
- ఉపవాస దినములు
- గౌరీ పంచాంగం / హోర చక్రము
- స్మార్ట్ టూల్స్ / రక్తదానం
- వాస్తు టిప్స్
- పద్యములు / శ్లోకాలు మరియు పురాణాలు
- పొడుపు కథలు / సామెతలు
- శిశు జనన పాద దోషములు
- నవరత్నములు
- నామకరణం
- బల్లిశాస్త్రము
- వివాహ మ్యాచింగ్
- అష్టమి / నవమి
- ముహూర్త విజ్ఞానము





అంతర్జాతీయ క్యాలెండర్‌లు

ప్రతివారం యూట్యూబ్‌లో శ్రీ కప్పగన్తు సుబ్బరామ సోమయాజులు గారి వారఫలాలు మరియు పండుగ విశేషాలు

ప్రతిరోజూ ఆ రోజు విశేషాలతో నోటిఫికేషన్లు మొదలైన మరెన్నో విషయములు గురించి తెలుగులో మీకు ఈ యాప్‌లో లభించును.

# పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



# విషయసూచిక


| | |
|---|---|
| బ్రహ్మపురాణంలోని విషయాలు | 16 |
| విష్ణుస్తుతి | 17 |
| వ్యాసస్తుతి | 17 |
| విష్ణుస్తుతి | 18 |
| ఆదిసర్గ | 19 |
| శ్రీకృష్ణుడి వంశం-జన్మవృత్తాంతం | 20 |
| పాతాళలోకం | 22 |
| రకరకాల నరకాలు | 23 |
| భూలోకంలో వున్న సకల తీర్థాలు | 27 |
| భారతవర్షం | 32 |
| కోణాదిత్య(కోణార్క్)క్షేత్ర మాహాత్మ్యం | 34 |
| సూర్యుడి పూజావిధానం-ఫలితాలు | 36 |
| సూర్యుడి అష్టోత్తర శతనామస్తోత్రం | 38 |
| దక్షుడు చేసిన శివస్తుతి | 40 |
| ఉత్కల (విరజా) క్షేత్రం | 49 |
| అవంతీ వైభవం | 50 |
| (పూరి) పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యం | 51 |
| పురుషోత్తమ క్షేత్రం పూర్వకథ | 52 |
| పురుషోత్తమ క్షేత్రాన్ని దర్శించిన - ఇంద్రద్యుమ్నుడు | 56 |
| వాసుదేవస్తుతి | 58 |
| మార్కండేయ మహర్షి వటవృక్షాన్ని దర్శించటం | 62 |
| మార్కండేయ తీర్థంలో స్నానవిధి | 68 |
| కల్పవృక్షం (మర్రిచెట్టు) నమస్కార విధి | 69 |
| నృసింహోపాసన మాహాత్మ్యం | 72 |
| శ్వేతమాధవ మాహాత్మ్యం | 74 |
| శ్వేతకృత విష్ణుస్తుతి | 76 |
| పంచతీర్థ స్నానవిధి | 79 |
| శ్రీకృష్ణ బలరామ సుభద్రల అభిషేకఫలం | 82 |
| శ్రీ కృష్ణస్తుతి | 83 |
| గుడివాయాత్రవిధి - ఫలం | 85 |
| పురుషోత్తమ పూజావిధి | 85 |
| శ్రీమహావిష్ణు లోకవైభవం | 86 |
| అనంత వాసుదేవ వైభవం | 88 |
| కండుమహర్షి ఉపాఖ్యానం | 91 |
| బ్రహ్మ పార స్తుతి | 95 |
| కండుముని చేసిన - పురుషోత్తమ స్తోత్రము | 96 |
| సంసార చక్రం | 101 |
| పాపాలు చేసినవారు పొందే జన్మలు | 103 |
| అన్నదాన మాహాత్మ్యం | 105 |
| సదాచారాలు | 107 |
| వర్ణాశ్రమ ధర్మాలు | 114 |
| ఆశ్రమ ధర్మాలు | 116 |
| సంకరజాతి-వర్ణసాంకర్య లక్షణాలు | 119 |
| ఉత్తమగతి ప్రాప్తి | 120 |
| వాసుదేవుడి మహిమ | 125 |
| శ్రీమహావిష్ణు భక్తులు పొందే - ఉత్తమగతులు | 129 |
| అల్పశ్రమతో అధికపుణ్యం | 131 |
| ప్రళయకాల సమయంలో - మానవుల ప్రవర్తన | 132 |
| క్షర-అక్షర తత్త్వాలు | 134 |
| బ్రహ్మపురాణ ఫలశ్రుతి | 136 |

# ఉపోద్ఘాతము

అం.ఆ

**వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ ।**
**నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా ॥**

**వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥**

## అష్టాదశ పురాణాలు

మన భారతవాఙ్మయంలో వేదాల తరువాత అంతటి ప్రాశస్త్యాన్ని పొందిన గ్రంథాలు పురాణాలు. వేదాల్లో చెప్పిన ధర్మాల్ని కథలరూపంలో, ఆఖ్యానాల రూపంలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలియచెప్పేవే పురాణాలు. అందుకే పురాణాల్ని పంచమవేదంగా కీర్తించారు. అసలు పురాణం అంటే? పురా అపినవం-పురాతనమైనప్పటికీ నూతనంగా వుండేది అని అర్థం. అలాగే 'పురా ఆనతి' అంటే ప్రాచీనకాలంలో జరిగింది అని, వాయుపురాణం పురాణశబ్దాన్ని నిర్వచిస్తే, 'పురాఏతత్ అభూత్' పూర్వం ఇలా జరిగింది అని బ్రహ్మాండ పురాణం పురాణశబ్దానికి అర్థాన్ని చెబుతుంది. వీటన్నిటినీ క్రోడీకరించి చూస్తే పురాణం అంటే పూర్వకాలంలో జరిగిన ఎన్నో విషయాల్ని వివరించి చెప్పేది అని తెలుస్తోంది.

పురాణాలు ఎన్ని-

పురాణాలు మహాపురాణాలు, ఉపపురాణాలని రెండు విధాలుగా వున్నాయి. మహాపురాణాలు 18, అలాగే ఉపపురాణాలు 18.

**బ్రహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవచ ।**
**భాగవతం నారదదీయం మార్కండేయంచ కీర్తితమ్ ॥**

**ఆగ్నేయంచ భవిష్యంచ బ్రహ్మవైవర్త లింగకే ।**
**వారాహంచ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

1.బ్రహ్మపురాణం 2.పద్మపురాణం 3.విష్ణుపురాణం 4.వాయు పురాణం 5.భాగవత పురాణం 6.నారదపురాణం 7.మార్కండేయ పురాణం

8.అగ్నిపురాణం 9.భవిష్యపురాణం 10.బ్రహ్మవైవర్త పురాణం 11.లింగపురాణం 12. వరాహ పురాణం 13.స్కాంద పురాణం 14.వామన పురాణం 15.కూర్మ పురాణం 16.మత్స్య పురాణం 17.గరుడ పురాణం 18.బ్రహ్మాండ పురాణం- ఈ పద్దెనిమిదీ మహాపురాణాలు. అలాగే 18 ఉపపురాణాలు కూడా వున్నాయి. ఈ మహాపురాణాల పేర్లని గుర్తుంచుకోవటానికి శ్లోకం కూడా వుంది.

**'మ' ద్వయం 'భ' ద్వయం చైవ 'బ్ర'త్రయం 'వ' చతుష్టయం ।**
**అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్ ॥**

'మ' తో మొదలయ్యేవి రెండు 1.మత్స్య 2.మార్కండేయ

'భ' తో మొదలయ్యేవి రెండు 1.భాగవత 2.భవిష్య

'బ్ర' తో మొదలయ్యేవి మూడు 1.బ్రహ్మ 2.బ్రహ్మవైవర్త 3.బ్రహ్మాండ

'వ' తో మొదలయ్యేవి నాలుగు 1.వాయు 2.విష్ణు 3.వామన 4.వరాహ

అ-అగ్ని, నా-నారద, ప-పద్మ, లిం-లింగ, గ-గరుడ, కూ-కూర్మ, స్కా-స్కాంద ఇలా మొత్తం పద్దెనిమిది పురాణాలు.

## పురాణాలు విష్ణుస్వరూపం

అష్టాదశ పురాణాలను సాక్షాత్తు విష్ణు స్వరూపంగా పోల్చారు. 18 పురాణాలని మహావిష్ణువు శరీరంలోని 18 అంగాలుగా భావిస్తారు మన ప్రాచీన ఋషులు.

1. బ్రహ్మపురాణం - శ్రీ మహావిష్ణువు శిరస్సు
2. పద్మపురాణం - శ్రీ మహావిష్ణువు హృదయం
3. విష్ణుపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిభుజం
4. వాయుపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమభుజం
5. భాగవతపురాణం - శ్రీ మహావిష్ణువు ఊరువులు
6. నారదపురాణం - శ్రీ మహావిష్ణువు నాభి
7. మార్కండేయపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిపాదం
8. అగ్నిపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమపాదం

| | | | |
|---|---|---|---|
| 9. | భవిష్యపురాణం | - | శ్రీ మహావిష్ణువు కుడిమోకాలు |
| 10. | బ్రహ్మవైవర్తపురాణం | - | శ్రీ మహావిష్ణువు ఎడమమోకాలు |
| 11. | లింగపురాణం | - | శ్రీ మహావిష్ణువు కుడి చీలమండ |
| 12. | వరాహపురాణం | - | శ్రీ మహావిష్ణువు ఎడమ చీలమండ |
| 13. | స్కందపురాణం | - | శ్రీ మహావిష్ణువు కేశాలు |
| 14. | వామనపురాణం | - | శ్రీ మహావిష్ణువు చర్మం |
| 15. | కూర్మపురాణం | - | శ్రీ మహావిష్ణువు పృష్ఠభాగం |
| 16. | మత్స్యపురాణం | - | శ్రీ మహావిష్ణువు మెదడు |
| 17. | గరుడపురాణం | - | శ్రీ మహావిష్ణువు మాంససారం |
| 18. | బ్రహ్మాండపురాణం | - | శ్రీ మహావిష్ణువు ఎముకలు |

పురాణ లక్షణం :-

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వంత రాణి చ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచ లక్షణం ॥**

పురాణానికి ఐదు లక్షణాలు ప్రధానంగా వుండాలని చెప్పారు. 1.సర్గ-అంటే ప్రపంచ సృష్టి, 2.ప్రతిసర్గ-ఈ ప్రపంచ ప్రళయం, 3.వంశం-రాజుల, ఋషుల, దేవతలకు సంబంధించిన వంశ విశేషాలు-అవతారాలు 4.వంశానుచరితం-రాజవంశాలలో, ఋషుల వంశాలలో పుట్టిన వారి జీవితచరిత్రలు, 5.మన్వంతరాలు-మనువులు, మనువు ద్వారా ఏర్పడ్డ సంతతి, ఆయా మన్వంతరాలలో జరిగిన విశేషాలు. ఈ విధంగా ప్రతిపురాణం పంచలక్షణాలతో కూడి వుంటుంది.

పురాణకర్త :-

**విష్ణోరంశో మునిర్జాత సత్యవత్యాం పరాశరాత్।**
**పురాణ సంహితాం దద్యే తేషాం ధర్మ విధిత్సయా ॥**

అనే ఈ ప్రమాణ శ్లోకం ప్రకారం సత్యవతీ పరాశర మహర్షి కుమారుడుగా శ్రీ మహావిష్ణు అంశంతో జన్మించిన వ్యాసుడే అష్టాదశ పురాణాల కర్త అని తెలుస్తోంది. ఈయననే కృష్ణద్వైపాయనుడు అని కూడా అంటారు. పురాణాలకు కర్త వ్యాసుడైతే వక్త సూతమహర్షి. ఈయన నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు ఈ పురాణాలన్నిటినీ ప్రబోధించాడు.

పురాణాల ప్రాచీనత :-

వేద వాఙ్మయం ఎంత విస్తృతంగా వుందో, పురాణ వాఙ్మయం కూడా అంత విస్తృతంగా వుంది. సాధారణంగా లోకంలో వేదాలు అత్యంత ప్రాచీనమైనవని చెబుతారు. అయితే ఈ శ్లోకం వేదాలకన్నా పురాణాలే ప్రాచీనమైనవని చెబుతుంది.

**పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతమ్ ।**
**నిత్యం శబ్దమయం పుణ్యం శతకోటి ప్రవిస్తరమ్ ।**
**అనంతరంచ వక్త్రేభ్యః వేదాంతస్య వినిర్గతాః ॥**

పూర్వం బ్రహ్మ నోటి నుంచి వందకోట్ల శ్లోకాలతో ముందు పురాణాలు బయలుదేరి ఆ తరువాత వేదాలు బయలుదేరాయట. ఇలా వందకోట్ల శ్లోకాలతో చతుర్ముఖ బ్రహ్మతో చెప్పబడ్డ పురాణం మొత్తం ఒక్కటిగానే వుండేది. అల్పబుద్ధులైన మానవుల కోసం ఆ బ్రహ్మదేవుడే వ్యాసుడి రూపంలో వచ్చి ఆ కోటిశ్లోకాల పురాణాన్ని నాలుగు లక్షల శ్లోకాలలోకి కుదించి దాన్ని పద్దెనిమిది పురాణాలుగా రచించాడని స్కందపురాణం చెబుతుంది.

**పురాణమేక మేవాసీ దస్మిన్ కల్పాంతరే నృప ।**
**త్రివర్గ సాధనం పుణ్యం శతకోటి ప్రవిస్తరమ్ ॥**
**స్మృత్వా జగాదచ మునీన్ ప్రతి దేవశ్చతుర్ముఖః ।**
**చతుర్లక్ష ప్రమాణేన ద్వాపరే ద్వాపరే సదా ।**
**తదష్టాదశథా కృత్వా భూర్లోకేஉ స్మిన్ ప్రభాష్యతే ॥** *(స్కంద పురాణం)*

## పాఠకులకు నమస్కారం

భగవాన్ వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలు ఆర్షవిద్యా భాండాగారాలు. ఆ భాండాగారాలలో నిక్షిప్తమైన ప్రధాన విషయాల్ని 18 పుస్తకాలుగా క్రోడీకరించి మీ ముందుకు తెస్తున్నాం. సరళమైన భాషలో మేము ప్రచురించిన ఈ 18 పురాణాలని ఆదరించి, మమ్మల్ని ప్రోత్సహిస్తారని ఆశిస్తూ... మీ

***- ప్రకాశకులు, వచనకర్త***

# అష్టాదశ పురాణాల మొదటి వక్త - శ్రోత

అష్టాదశ పురాణాలను మొదటగా చెప్పిన వక్తలు వారి నుంచి మొదటిసారి విన్న శ్రోతలు ఈ క్రింద చెప్పిన విధంగా వుంటారు. అదేవిధంగా ఒక్కొక్క పురాణానికి వక్తృ శ్రోతృపరంపర వేరువేరు విధాలుగా ఉండవచ్చు.

| సం. పురాణం | ఏకల్ప వృత్తాంతం | వక్తృశ్రోతలు |
|---|---|---|
| 1. బ్రహ్మ పురాణాన్ని | బ్రహ్మ కల్పంలో | బ్రహ్మ మరీచి మహామునికి బోధించాడు |
| 2. పద్మ పురాణాన్ని | పద్మ కల్పంలో | స్వయంభువుమనువు బ్రహ్మకు బోధించాడు |
| 3. విష్ణు పురాణాన్ని | వరాహ కల్పంలో | పరాశరుడు బ్రహ్మకు బోధించాడు |
| 4. శివ(వాయు)పురాణాన్ని | శ్వేత కల్పంలో | శివుడు వాయువుకు బోధించాడు |
| 5. భాగవత పురాణాన్ని | సారస్వత కల్పంలో | విష్ణువు బ్రహ్మకు బోధించాడు |
| 6. నారద పురాణాన్ని | బృహత్ కల్పంలో | పూర్వ భాగాన్ని – సనకాదులు నారదునికి బోధించారు. ఉత్తరభాగాన్ని – వశిష్ఠుడు మాంధాతకు బోధించాడు |
| 7. మార్కండేయ పురాణాన్ని | శ్వేత వారాహకల్పంలో | మార్కండేయుడు జైమినికి బోధించాడు |
| 8. అగ్ని పురాణాన్ని | ఈశాన కల్పంలో | అగ్నిదేవుడు వశిష్ఠునికి బోధించాడు |
| 9. భవిష్య పురాణాన్ని | అఘోర కల్పంలో | బ్రహ్మ మనువుకు బోధించాడు |
| 10. బ్రహ్మవైవర్త పురాణాన్ని | రథంతర కల్పంలో | సావర్ణి నారదునికి బోధించాడు |
| 11. లింగ పురాణాన్ని | కల్పాంత కల్పంలో | పరమశివుడు నారదునికి బోధించాడు |
| 12. వరాహ పురాణాన్ని | మనుకల్పంలో | విష్ణువు పృథ్వికి బోధించాడు |
| 13. స్కాంద పురాణాన్ని | తత్పురుషకల్పంలో | స్కందుడు భూమికి బోధించాడు |
| 14. వామన పురాణాన్ని | కూర్మ కల్పంలో | బ్రహ్మ పులస్త్య మహామునికి బోధించాడు |
| 15. కూర్మ పురాణాన్ని | లక్ష్మీ కల్పంలో | విష్ణువు పులస్త్య మహామునికి బోధించాడు |
| 16. మత్స్య పురాణాన్ని | సప్త కల్పంలో | విష్ణువు మనువుకు బోధించాడు |
| 17. గరుడ పురాణాన్ని | గరుడ కల్పంలో | విష్ణువు మనువుకు బోధించాడు |
| 18. బ్రహ్మాండ పురాణాన్ని | భవిష్య కల్పంలో | బ్రహ్మ మనువుకు బోధించాడు |

# పురాణాలు ఎందుకు చదవాలి?

**పురాణశ్రవణే శ్రద్ధా యస్య స్యాద్ద్వాతరస్వహమ్ ।**
**తస్య సాక్షాత్ప్రసన్నః స్యాత్ శివో విష్ణుశ్చ సానుగః ॥**

**యత్స్నాత్వా పుష్కరే తీర్థే యాగే సింధౌ చ సంగమే ।**
**తత్ఫలం ద్విగుణం తస్య శ్రద్ధయా వై శృణోతి యః ॥**

**యే పఠంతి పురాణాని శృణ్వన్తి చ సమాహితాః ।**
**ప్రత్యక్షరం లభంత్యేతే కపిలాదానజం ఫలమ్ ॥**

**అపుత్రో లభతే పుత్రం ధనార్థీ లభతే ధనమ్ ।**
**విద్యార్థీ లభతే విద్యాం మోక్షార్థీ మోక్షమాప్నుయాత్ ॥**

**యే శృణ్వన్తి పురాణాని కోటిజన్మార్జితం ఖలు ।**
**పాపజాలంతు తే హిత్వా గచ్ఛన్తి హరిమందిరమ్ ॥**


పురాణాలు వినడంలో ఎవరికైతే శ్రద్ధ ఉంటుందో మరియు నిత్యము ఎవరైతే శ్రవణం చేస్తారో, అటువంటి వారి విషయంలో శివ-కేశవులు మరియు వారి గణాలు సంపూర్ణానుగ్రహం ప్రదర్శిస్తారు. పుష్కర తీర్థాల్లో, ప్రయాగ మొదలైన నదీసంగమ క్షేత్రాల్లో స్నానాలాచరిస్తే ఏవిధమైన పుణ్యం పొందగలరో దాని రెట్టింపు పుణ్యం పురాణ శ్రోతలకు లభిస్తుంది. భక్తి శ్రద్ధలతో పురాణ పఠన-శ్రవణాలు చేసేవారు కపిలగోవును దానం చేస్తే కలిగే పుణ్యరాశిని పొందగలరు. పుత్రులు లేనివారు పుత్రులను, దరిద్రులు ధనాన్ని, విద్యార్థులు విద్యను, మోక్షగాములు మోక్షాన్ని పొందగలరు. పురాణ శ్రోతలు తమ కోటి జన్మల పాపాలను దూరం చేసికొని చివర్లో శ్రీమన్నారాయణమూర్తి సాయుజ్యం పొందగలరు.

# పురాణ వైభవం

**అష్టాదశ పురాణానాం నామధేయాని యః పఠేత్ ।**
**త్రి సంధ్యం జపతే నిత్యం సోఽశ్వమేధ ఫలం లభేత్ ॥**

ఈ అష్టాదశ మహాపురాణాల పేర్లను ఉదయ-మధ్యాహ్న-సాయంకాల సమయాల్లో ఎవరైతే పఠిస్తారో వారు అశ్వమేధ ఫలాన్ని పొందగలరని భావం.

# శ్రీ బ్రహ్మ పురాణం



శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే ॥

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అష్టాదశ పురాణాలలో బ్రహ్మపురాణం మొదటిది. 'బ్రహ్మం మూర్ధా హరేరేవ' అన్న మాట ప్రకారం ఈ బ్రహ్మపురాణం శ్రీమహావిష్ణువు శిరస్సుగా చెప్పబడింది. "నానాఖ్యానేతిహాసాద్యం దశ సాహస్రముచ్యతే" అనగా ఈ పురాణంలో మొత్తం పదివేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వభాగం ఉత్తరభాగం అని రెండు భాగాలుగా విభజించబడింది. ఈ పురాణంలో మొత్తం 246 అధ్యాయాలున్నాయి.

పేరుకి ఈ పురాణం బ్రహ్మపురాణం అనివున్నా ఇందులో బ్రహ్మదేవుడికి సంబంధించిన అంశాలు వుండవు. అత్యధికంగా శ్రీమహావిష్ణువు గురించిన విశేషాలు, కథనాలే ఈ పురాణంలో చెప్పబడ్డాయి. అందుకే ఈ పురాణాన్ని వైష్ణవ పురాణంగానే కీర్తిస్తారు.

ఆద్యం సర్వపురాణానాం పురాణం బ్రహ్మముచ్యతే ।
అష్టాదశ పురాణాని పురాణజ్ఞాః ప్రచక్ష్యతే ॥

అని విష్ణు పురాణంలోని శ్లోకం బ్రహ్మపురాణాన్ని ఆదిపురాణంగా పేర్కొంటుంది. "రాజ సేషుచ మాహాత్మ్య మధికం బ్రహ్మణోవిదుః" అన్న మత్స్య పురాణంలోని శ్లోకం ప్రకారం బ్రహ్మపురాణం రాజసపురాణంగా చెప్పబడింది.

# బ్రహ్మపురాణంలోని విషయాలు

**1-20 అధ్యాయాలు :** వ్యాస స్తుతితో ప్రారంభమైన ఈ పురాణంలో సృష్టికథనం, మన్వంతరాలకీర్తనం, ఆదిత్యుడి జననం, ఆదిత్యుడి కీర్తి, సోముడి జననం, సోమవంశ కీర్తి, పురవంశ వర్ణనం, శ్రీకృష్ణజన్మ సంకీర్తనం, శ్యమంతకోపాఖ్యానం, జంబూద్వీప వర్ణనం, పాతాళప్రమాణం, నరకవర్ణన వంటి ప్రధాన విషయాలు చెప్పబడ్డాయి.

**20-40 అధ్యాయాలు :** వీటిలో సర్వతీర్థ మాహాత్మ్యం, భారతవర్షం, కోణాదిత్య మాహాత్మ్యం, మార్తాండ మాహాత్మ్యం, రుద్రాఖ్యానం, పార్వతీతపస్సు, ఉమామహేశ్వర కల్యాణం, బ్రహ్మచేసిన శివస్తుతి, మన్మథుడి దహనం, దక్షయజ్ఞ విధ్వంసం, దక్షుడు చేసిన శివస్తుతి వంటి ప్రధాన విషయాలు వివరించబడ్డాయి.

**40-69 అధ్యాయాలు :** వీటిలో ఏకామ్రక్షేత్రమాహాత్మ్యం, ఉత్కళక్షేత్ర మాహాత్మ్యం, అవంతీవర్ణన, పురుషోత్తమ క్షేత్ర వైభవం, ప్రతిమానిర్మాణ విధానం, పురుషోత్తముడి వర్ణన, మార్కండేయుడు మర్రి ఆకుని చూడటం, మార్కండేయుడు చూసిన ప్రళయం, పంచతీర్థ మాహాత్మ్యం, నృసింహ మాహాత్మ్యం, శ్వేతమాధవ మాహాత్మ్యం, సముద్ర స్నానవిధి, కృష్ణా నదీ స్నాన మాహాత్మ్యం, గుడివాయాత్ర, ద్వాదశయాత్రలు, విష్ణులోక వైభవం తదితర విశేషాలు వర్ణించబడ్డాయి.

**70-175 అధ్యాయాలు :** వంద అధ్యాయాలలో సంపూర్ణంగా గౌతమీ మాహాత్మ్యం వర్ణించబడింది.

**176-211 అధ్యాయాలు :** వీటిలో అనంతవాసుదేవ మాహాత్మ్యం హరి అంశావతారాలు, శ్రీకృష్ణుడి జననం, గోవర్ధనోద్ధారణం, రుక్మిణీ కల్యాణం, నరకాసురవధ, అనిరుద్ధ చరిత్ర, శ్రీకృష్ణ నిర్యాణం తదితర విశేషాలు వర్ణించబడ్డాయి.

**212-246 అధ్యాయాలు :** వీటిలో విష్ణువు ధరించిన వివిధ అవతారాలు, యమలోక మార్గం, నరకంలోని దుఃఖాలు, అన్నదాన ప్రశంస, సదాచార

వర్ణన, వర్ణాశ్రమ ధర్మాలు, మానవులకి ఉత్తమగతి ప్రాప్తించే మార్గాలు, వాసుదేవమహిమ, ద్వాపర యుగాంతం, యోగాభ్యాసం, జ్ఞాన యోగం, మోక్షప్రాప్తి, విద్య అవిద్యల స్వరూపం, వశిష్ఠ జనక సంవాదం లాంటి ప్రధాన విషయాలు వర్ణించబడ్డాయి.

## విష్ణుస్తుతి

యంధ్యాయంతి బుధాః సమాధిసమయే శుద్ధం వియత్సన్నిభే ।
నిత్యానందమయం ప్రపన్నమమలం సర్వేశ్వరం నిర్గుణమ్ ।
వ్యక్తావ్యక్తపరం ప్రపంచ రహితం ధ్యానైక గమ్యం విభుమ్ ।
తం సంసార వినాశహేతు మజరం వందే హరిం ముక్తిదం ॥

విద్వాంసులు తమ సమాధి స్థితిలో ఎవరిని శుద్ధ స్వరూపుడుగా, ఆకాశంలా సర్వవ్యాపకుడుగా ధ్యానిస్తారో, అలాంటి నిత్యానంద స్వరూపుడిని, ప్రసన్నాత్ముడిని, నిర్మలుణ్ణి, నిర్గుణుణ్ణి, సర్వేశ్వరుణ్ణి, వ్యక్తావ్యక్త స్థితికి అతీతమైనవాడిని, ధ్యానమాత్రగమ్యుడిని, ప్రకాశవంతమైన వాడిని, జననమరణ సంసార వినాశహేతువైన వాడిని మోక్షాన్ని ప్రసాదించేవాడిని, శ్రీహరిని ధ్యానిస్తాను.

## వ్యాసస్తుతి

ఆధార భూతం విశ్వస్యావ్యణీయాంస మణీయసాం ।
ప్రణమ్య సర్వభూతస్థ మచ్యుతం పురుషోత్తమమ్ ॥ 1

జ్ఞాన స్వరూప మత్యంతం నిర్మలం పరమార్థతః ।
తమేవార్థ స్వరూపేణ భ్రాంతి దర్శనతః స్థితమ్ ॥ 2

విష్ణుంగ్రసిష్ణుం విశ్వస్య స్థితౌ సర్గేతథా ప్రభుమ్ ।
సర్వజ్ఞం జగతామీశ మజమక్షయ మవ్యయమ్ ॥ 3

ఆద్యం మసూక్ష్మం విశ్వేశం పరాశర సుతం ప్రభుమ్ ।
గురుం ప్రణమ్య వక్ష్యామి పురాణం వేద సమ్మితమ్ ॥ 4

*(అధ్యా-1, శ్లో-25-29)*

ప్రపంచానికి ఆధారమైనవాడు, అణువుకన్నా అణువుగా వుండేవాడు. సర్వభూతాలలో కొలువైనవాడు, అచ్యుతుడు, జ్ఞానమూర్తి, పరమపవిత్రమైన వాడు, పురుషోత్తముడు, నిర్మలుడు, ఈ జగత్తుగా కనిపిస్తూ భ్రాంతిగొలిపేవాడు, సర్వవ్యాపకుడు, సర్వాన్నీ కబళించేవాడు, సృష్టిస్థితుల్ని చేయగల సమర్థుడు, సర్వస్వతంత్రుడు, సర్వజ్ఞుడు, పుట్టటం, పెరగటం, నశించటం అనేవిలేనివాడు, అన్నిటికన్నా ఆద్యుడు, సూక్ష్మస్వరూపంతో ఉండేవాడు అయిన విశ్వేశ్వరుణ్ణి ముందుగా నమస్కరించి వేదవేదాంగ వేత్త సర్వశాస్త్ర రహస్యతత్త్వాన్ని ఎరిగినవాడు అయిన పరాశరుడి కుమారుడు వ్యాసమహర్షిని నా గురువుగా భావించి వేద తాత్పర్య సదృశమైన ఈ బ్రహ్మపురాణాన్ని చెబుతున్నాను అంటూ రోమహర్షణ మహర్షి (సూతుడు) ఈ దివ్య పురాణాన్ని నైమిశారణ్యంలోని మునులకి చెప్పటం ప్రారంభించాడు.

## విష్ణుస్తుతి

అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైక రూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥ 1

నమో హిరణ్యగర్భాయ హతయేశంకరాయచ ।
వాసుదేవాయ తారాయ సర్గస్థిత్యంత కర్మణే ॥ 2

ఏకానేక స్వరూపాయ స్థూలసూక్ష్మాత్మనే నమః ।
అవ్యక్తావ్యక్త భూతాయ విష్ణవే ముక్తిహేతవే ॥ 3

సర్గస్థితి వినాశాయ జగతో యోఽ జరామరః ।
మూలభూతో నమస్తస్మై విష్ణవే పరమాత్మనే ॥ 4

*(శ్లో॥ 21-24 అధ్యా-1)*

షడ్భావవికారాలు (1.ఉనికి 2.పుట్టటం 3.పెరగటం 4.తరగటం 5.మార్పుచెందటం 6.నశించటం) లేనివాడు, శుద్ధ స్వరూపుడు, నిత్యుడు, సర్వవ్యాపకుడు, సర్వాన్నీ జయించిన వాడు, సృష్టిస్థితి లయాలు చేసేవాడు, ఒకేరూపం, వివిధ రూపాలూ తానే అయినవాడు, స్థూల, సూక్ష్మరూపాలు

ధరించేవాడు, వ్యక్తా వ్యక్త స్వరూపుడు, ముక్తిని ప్రసాదించేవాడు, జగత్తుని నిర్మించి పరిపాలించేవాడు. వార్ధక్యం లేనివాడు, మరణం లేనివాడు సర్వానికీ మూలబీజమైనవాడు అయిన విష్ణు పరమాత్మకి నమస్కారం.

## ఆదిసర్గ

అన్నిటికన్నా పూర్వం ఎవరికీ తెలియనిది, వ్యక్తంకానిది, నిత్యంగా వుండేది లేనిది అయిన ఒక దివ్య తత్త్వం ఉన్నది. ఆ తత్త్వం నుంచే పరమేశ్వరుడు ఈ విశ్వాన్ని సృష్టించాడు. దానినే తత్త్వం అంటారు. సకల భూతాలనీ సృష్టించేవాడు బ్రహ్మ. ఆయన నారాయణ పరాయణుడు. అదే మహత్తత్వం. అనగా బుద్ధి. దాని నుంచి అహంకారం, ఆ అహంకారం నుంచి పంచభూతాలు ఆవిర్భవించాయి. వీటన్నిటి స్థితులు, భేదాలు బట్టి సకల ప్రాణకోటి సృష్టించబడింది. దీనినే సనాతన ధర్మం లేదా సర్గం (సృష్టి) అంటారు.

స్వయంభువుడైన బ్రహ్మదేవుడు మొదట నీటిని సృష్టించాడు. ప్రకాశించే ఆ జలంలోకి ఆయన తన వీర్యాన్ని (సృష్టి సంకల్పాన్ని) వదిలాడు. "స ఐక్షత బహుస్యాం ప్రజాయేయేతి) తరువాత తానే ఎన్నోరూపాలతో జన్మించాలని భావించాడు.

నీటికి నీరము అనిపేరు. ఈ నీరు మానవ సృష్టికి మూలం. మానవులకి ఆ నీరు మొదటి గమ్యస్థానం. కాబట్టి ఆ నీటిని సృష్టించిన బ్రహ్మ నారాయణుడనే పేరు పొందాడు. ఆయన (బ్రహ్మ) వదలిన వీర్యం ఒక బంగారు గుడ్డుగా మారి నీటిలో తేలింది. తేలిన ఆ అండం నుంచి బ్రహ్మదేవుడు తానే స్వయంభువుగా ఆవిర్భవించాడు. అందుకే ఆయన్ని హిరణ్యగర్భుడు అంటారు.

అండం నుంచి జన్మించిన బ్రహ్మ పదిసంవత్సరాలు పాటు అలాగే వున్నాడు. తరువాత నీరు రూపంలో వున్న ఆ తత్త్వాన్ని దివం-భువం అనే పేర్లతో రెండుగా చేసాడు. ఆ దివం-భువం మధ్యభాగాన్ని ఆకాశంగా నిర్మించాడు. తరువాత ఆ నీటిలో అడుగున వున్న భూమిని పైకి తేల్చాడు. తేలిన భూమికి పది దిక్కుల్ని కల్పించాడు. ఆ భూమి మీద కాలం, మనస్సు,

కామం, క్రోధం, రతి అనే వాటిని సృష్టించాడు. ఇక భూమి మీద సృష్టిని కొనసాగించాలని భావించి తన మనస్సు నుంచి మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు అనే మహర్షుల్ని వరుసగా సృష్టించాడు. వీరే సప్తర్షులని విఖ్యాతి పొందారు.

ఈ సప్తర్షులకన్నా ముందుగానే బ్రహ్మ తనలోని రోషం నుంచి రుద్రుణ్ణి, ఆయన తరువాత సనత్కుమారుణ్ణి సృష్టించాడు. బ్రహ్మ మనసు నుంచి ఆవిర్భవించిన సప్తర్షుల ద్వారా ఎంతోమంది ప్రజలు, ప్రజాపతులు, ఏకాదశరుద్రులు పుట్టారు. వీరిలో స్కందుడు సనత్కుమారుడు సృష్టికార్యం చేయటానికి ఇష్టపడలేదు. అయితే సప్తర్షులు మాత్రం బ్రహ్మ ఆజ్ఞానుసారం గృహస్థులై ప్రజాసృష్టి కొనసాగించారు.

తరువాత బ్రహ్మదేవుడు మేఘాల్ని, మెరుపుల్ని, పిడుగుల్ని, లోహితాలని, ఇంద్రధనుస్సును, పశుపక్ష్యాదుల్ని సృష్టించాడు. యజ్ఞయాగాది క్రతువుల కోసం ఋగ్వేదాన్ని, యజుర్వేదాన్ని, సామవేదాన్ని సృష్టించాడు. వాటి తరువాత సిద్ధుల్ని, సాధ్యుల్ని సృష్టించాడు. ఆ విధంగా బ్రహ్మ శరీరం నుంచి ఎన్నో భూతాలు (ప్రాణులు) ఆవిర్భవించాయి.

ఇలా ఎంతచేసినా తన సృష్టి అనుకున్నంత వేగంగా వృద్ధి చెందటం లేదు. అది గమనించిన బ్రహ్మ తన శరీరాన్ని రెండు భాగాలుగా చేసాడు. అవి ఒకటి పురుషుడు, రెండోది స్త్రీగా మారింది. ఆ పురుషుడు స్త్రీ ద్వారా ఎంతోమంది మానవుల్ని కన్నాడు. ఆ పురుషుడే ముల్లోకాల్లో వ్యాపించి విష్ణువు అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. ఆ పురుషుడే విరాట్పురుషుణ్ణి సృష్టించాడు. ఆయనే మనువుని కూడా సృష్టించాడు. ఆ మనువు వంశపరంపరే మన్వంతరం అని విఖ్యాతి చెందింది. మనువు ద్వారా అసంఖ్యాకంగా మానవజాతి వృద్ధి చెందింది. బ్రహ్మ మానవసృష్టిలో ఇది రెండోది.

## శ్రీ కృష్ణుడి వంశం - జన్మవృత్తాంతం

క్రోష్టుడు అనేవాడికి ఇద్దరు భార్యలు గాంధారి–మాద్రి. వీరిలో గాంధారి అనమిత్రుడనే వాడిని, మాద్రి యధాజత్తు దేవమీఢుడనే వాణ్ణి కన్నారు.

వీరి సంతానమే కాలక్రమంలో వృష్టివంశంగా మూడు శాఖలతో వర్ధిల్లింది. తిరిగి మాద్రికి – పృష్ణ, అంధకుడు అనే పుత్రులు జన్మించారు. వీరిలో వృష్ణికి శ్వఫల్కుడు, చిత్రకుడు అనే కుమారులుదయించారు.

పృష్ణికుమారుల్లో శృఫల్కుడు పరమధర్మపరాయణుడు. ఆయన పాలనలో అతివృష్టి, అనావృష్టి, వ్యాధి భయం ఇలాంటివేవీ లేకుండా ప్రజలంతా సుఖంగా కాలం గడిపారు. ఆ రోజుల్లో కాశీరాజ్యం మీద కోపంతో ఇంద్రుడు మూడు సంవత్సరాలు అక్కడ వర్షం కురిపించలేదు. అప్పుడు శ్వఫల్కుడు కాశీరాజుని తన రాజ్యానికి తీసుకువచ్చాడు. శ్వఫల్కుడి ఆదరాభిమానాలకి ముగ్ధుడై కాశీరాజు తన కుమార్తెని అతనికిచ్చి వివాహం చేసాడు.

శ్వఫల్కుడికి కాశీరాజు కుమార్తెకి వరుసగా దాత, యజ్వు, వీరుడు, పండితుడు, అతిథిప్రియుడు, భూరిదక్షిణుడు, అక్రూరుడు, ఉపమద్గువు, మద్గువు, మందరుడు, అరమేజయుడు, అవిక్షతుడు, అంధకరువు, అవాహుడు, ప్రతివాహుడు అనే కుమారులు సుందరి అనే కుమార్తె జన్మించారు.వీరిలో అక్రూరుడికి – ప్రసేనుడు, ఉపదేవుడు అనేవారు జన్మించారు.

వృష్ణి రెండో కుమారుడైన చిత్రకేతుడికి పృధువు, విపృధువు, అశ్వగ్రీవుడు, అశ్వబాహువు,సుపార్శ్వుడు, గవేషణుడు, అరిష్టనేమి, అశ్వుడు, సుదర్ముడు, సుబాహువు, బహు బాహువు అనే కుమారులు, శవిష్ఠ శ్రవణ అనే కుమార్తెలు జన్మించారు.

మాద్రి పుత్రుడైన దేవమీఢుడు అసిక్ని అనే ఆమెని వివాహం చేసుకుని ఆమె ద్వారా శూరుడు అనే పుత్రుణ్ణి కన్నాడు. ఆ శూరుడికి 'భోజ్య' అనే భార్య ద్వారా పదిమంది వీరులైన కుమారులుదయించారు. ఆ తరువాత శూరుడికి వసుదేవుడు జన్మించాడు. వసుదేవుడు పుట్టగానే ఆకాశంలో దేవదుందుభులు మ్రోగాయి. పూల వానకురిసింది. చంద్రుడి కాంతితో ప్రకాశించే వసుదేవుడు గొప్ప అందగాడుగా కీర్తిగాంచాడు.

వసుదేవుడు పురవంశంలో పుట్టిన పౌరవి, రోహిణీ, మధిరా, ఆదీ, వైశాఖీ, భద్రా, సునామ్నీ, సహదేవీ, శాంతిదేవీ, శ్రీదేవీ, దేవరక్షితా, వృకదేవీ, ఉపదేవీ, దేవకీ అని పద్నాలుగుమందిని వివాహం చేసుకున్నాడు. ఈ భార్యలలో పౌరవి, రోహిణి అనే ఇద్దరూ బాహ్లికుడి కుమార్తెలు. వసుదేవుడి పెద్ద భార్య పౌరవికి రాముడు, శరణ్యుడు, శరడు, దుర్ధముడు, దమనుడు, శుభ్రుడు, పిండారకుడు, ఉశీనుడు అనే కుమారులు చిత్ర అనే కుమార్తె జన్మించారు. ఈ చిత్రనే సుభద్ర అని కూడా అంటారు.

వసుదేవుడికి దేవకీదేవి ద్వారా శ్రీకృష్ణుడు జన్మించాడు. బలరాముడికి రేవతి ద్వారా నిశరుడు ప్రియపుత్రుడు అనే కుమారులు ఉదయించారు. అర్జునుడికి సుభద్ర ద్వారా అభిమన్యుడు జన్మించాడు. అక్రూరుడికి కాశీరాజు కుమార్తె ద్వారా సత్యకేతువు అనేవాడు జన్మించాడు. ఈ విధంగా క్రోష్టు వంశ పరంపర కొనసాగింది.

## పాతాళలోకం

భూమండలం మొత్తం వైశాల్యం డెబ్భైవేల యోజనాలుంటుంది. దాని ఎత్తుకూడా అంతే పరిమాణంలో వుంటుంది. పాతాళం వైశాల్యం పదివేల యోజనాలు. అతల, వితల, నితల, సుతల, తలాతల, రసాతల పాతాళాలు అనే భూమికింద మొత్తం ఏడు లోకాలుంటాయి. వీటినే సప్త పాతాళ లోకాలంటారు. ఈ పాతాళంలో శుక్ల, అరుణ, పీత శర్కరా, శైలకాంచనీ అనే ప్రదేశాలు ఎత్తైన సౌధాలతో విరాజిల్లుతూ వుంటాయి. అక్కడ దైత్య దానవ జాతులవారు ఎందరో నివసిస్తుంటారు.

అసలు స్వర్గం కన్నా పాతాళలోకమే ఎంతో సుందరంగా వుంటుంది. ఈ విషయాన్ని నారదమహర్షి ఒకసారి ఇంద్ర సభలో చెప్పాడు. పాతాళంలో అందమైనవి ఎంతో దివ్యకాంతిని వెదజల్లే రత్నాలున్నాయి. నాగాభరణాలు నాగ భూషణాలు ఎన్నో వున్నాయి. దైత్యదానవుల కన్యలు ఇక్కడ ఆనందంగా విహరిస్తుంటారు. పగలు సూర్యుడి కిరణాలు కేవలం కాంతినే కలిగిస్తాయి

కానీ వేడిని ఇవ్వలేవు. రాత్రిపూట చంద్రుడి వెన్నెల కాంతుల్ని వెదజల్లుతుంది. తప్ప చలిని కలిగించదు. నిత్యం ఆనందంగా షడ్రసోపేతమైన ఆహారాన్ని భుజిస్తూ సుఖభోగాలలో మునిగి తేలే దానవులకి కాలగమనమే తెలియదు. సుందరమైన నదులతో, తటాకాలతో, విలసిల్లే పాతాళలోకంలో దానవులు దైత్యులతోపాటు నాగులు కూడా భోగాల్ని అనుభవిస్తూ వుంటారు.

ఈ పాతాళలోకానికి అడుగున శ్రీమహావిష్ణువు తమోమయ శరీరం ఆదిశేషుడు అనే పేరుతో విలసిల్లుతుంటుంది. దేవర్షులు, రాజర్షులు, సిద్ధులు ఆయన్నే అనంతుడు అని కీర్తిస్తుంటారు. స్వస్తికముద్రతో విలసిల్లే వేయిపడగలతో ఆదిశేషుడు ప్రకాశిస్తూ వుంటాడు. తన అనుచరులతో సహా అక్కడే నివాసముండే ఆ ఆదిశేషుడు ఒక చేత్తో నాగలి, మరోచేత్తో రోకలి ధరించి, వారుణి అనే నాగకన్యతో ఉపాసించబడుతూ వుంటాడు. కల్పాంతంలో ఆ శేషుడి వేయి పడగల నుంచి విషాగ్నిజ్వాలలు ఉద్భవిస్తాయి. ఆ జ్వాలలలోంచే రుద్రుడు ఆవిర్భవించి మూడులోకాల్నీ భక్షిస్తాడు.

ఒక మహాపర్వతంలాగా వేయి పడగల మీద ఈ భూమండలాన్నంతా భరిస్తున్న అనంతుణ్ణి వర్ణించటానికి దేవతలకి కూడా శక్తి చాలదు. మదోన్మత్తుడైన కళ్ళతో ఆ అనంతుడు ఎప్పుడు విజృంభిస్తాడో అప్పుడే ఈ భూమండలమంతా పర్వతాలు సాగరాలతో సహా కంపిస్తుంది. సకలదేవ, అప్సర, సిద్ధ, చారణ గణాలు సైతం ఆయన మహిమని తెలుసుకోలేరు. అందుకే ఆయన్ని అనంతుడంటారు. మహానుభావుడైన ఆ అనంతుణ్ణి అర్చించి గర్గాచార్యుడు జ్యోతిషవిజ్ఞానాన్ని నేర్చుకున్నాడు. సకల శకునరహస్యాలు తెలుసుకోగలిగాడు.

## రకరకాల నరకాలు

పాపాత్ములైన వారిని వివిధ రకాల శిక్షలకి గురిచేసే నరకాలు చాలానే వున్నాయి. వాటిలో ముఖ్యమైనవి –1.రౌరవం 2.శౌకరం 3.రోధనం 4.తాలం 5.విశసం 6.మహాజ్వాల 7.తప్తకుడ్యం 8.అసిపత్రవనం 9.విమోచనం 10.రుధిరాంధం 11.వసాతప్తం 12.కృమీశం 13.క్రిమిభోజనం 14.మహాలోభం

15.కృష్ణం 16.లాలాభక్షణం 17.పూయవహం 18.వహ్నిజ్వాల 19.అధశ్శిరం 20.సదంశం 21.కృష్ణసూత్రం 22.తమస్సు 23.అవీచి 24.శ్వభోజనం 25.అప్రతిష్టం 26.సూచీముఖం అనేవి. ఈ నరకాలన్నీ యమధర్మరాజు పాలనలో వుంటాయి. ఇందులో శస్త్రాస్త్రాలు ధరించినవారు, వాటిని ప్రయోగించగలిగేవారు అయిన యమభటులు వుంటారు. పాపాలు చేసి తమతమ నరకాలకి వచ్చిన వారిని వీరు శిక్షిస్తూ వుంటారు.

**రౌరవనరకం :** దొంగసాక్ష్యాలు చెప్పేవాడు, పక్షపాతంగా మాట్లాడేవాడు, అబద్ధాలు చెప్పేవాడు, నగరాల్ని ధ్వంసం చేసేవాడు, చిన్నపిల్లల్ని చంపేవాడు, గోహత్య చేసినవాడు, జీవులకి ఊపిరి అందకుండా చేసేవాడు భయంకరమైన రౌరవనరకానికి వెళతాడు.

బంగారాన్ని దొంగలించేవాడు, దానికి ప్రోత్సాహాన్నిచ్చినవాడు 'శూకర' అనే నరకానికి వెళతారు. క్షత్రియుల్ని, వైశ్యుల్ని చంపేవారు, గురుపత్నితో, సొంత అక్కాచెల్లెళ్ళతో సంగమంచేసేవాడు, రాజభటుల్ని హత్యచేసేవాడు 'తప్తకుంభం' అనే నరకంలో పడతారు. మద్యపానాన్ని చేసేవాడు, మద్యాన్ని విక్రయించేవాడు, తలారి, చంపదగినవాణ్ణి కాపాడేవాడు, విషాన్ని, విషపదార్థాలని అమ్మేవాడు 'తప్తలోహం' అనే నరకానికి వెళతారు.

స్వంత కోడలితో, కూతురితో సంగమించేవాడు, 'మహాజ్వాలం' అనే నరకానికి చేరి ఘోరంగా శిక్షించబడతాడు. వేదాల్ని దూషించేవాడు, వేదాల్ని విక్రయించేవాడు 'శబలం' అనే నరకానికి వెళతాడు. దొంగతనాలు చేసేవాడు, హద్దుమీరి అతిగా పెద్దల ఎడల ప్రవర్తించేవాడు 'విమోహం' అనే నరకాన్ని చేరుకుంటాడు. దేవతల్ని, విప్రుల్ని, తల్లి తండ్రుల్ని అకారణంగా ద్వేషించేవాడు, రత్నాలని గొప్ప వస్తువుల్ని దూషించేవాడు, 'క్రిమిభక్ష్యం' అనే నరకంలో పడి శిక్షలు అనుభవిస్తాడు. దుష్టయాగాలు చేసేవాడు కృమీశం అనే నరకానికి పిత్రు తిథుల్ని విస్మరించి భుజించేవాడు 'లాలాభక్ష్యం' అనే నరకానికి వెళతారు. బాణాలను తయారు చేసేవాడు 'వేధకం' అనే నరకానికి ఖడ్గంలాంటి మారణాయుధాల్ని తయారుచేసేవాడు 'విశసనం' అనే నరకంలో పడతారు.

అపాత్రదానం స్వీకరించినవాడు, చేయకూడనివాడితో యజ్ఞయాగాలు చేయించినవాడు, జ్యోతిష్యశాస్త్రం తెలియకుండానే జాతకాలు ముహూర్తాలు చూసి చెప్పేవాడు. 'అధోముఖం' అనే నరకానికి వెళతాడు.

వచ్చిన అతిథులకి అన్నంపెట్టకుండా తాను ఆహారాన్ని స్వీకరించేవాడు, లక్కమాంసం, రసాలు, మధురపానీయాలు, నువ్వులు, ఉప్పు అమ్మే బ్రాహ్మణుడు కూడా 'కృమిపూయ' నరకంలో పడతాడు. పిల్లి, కోడి, మేక, కుక్క, పంది, గుర్రం వంటి జంతువుల్ని పెంచేవాడు కూడా కృమిపూయ నరకానికి చేరుకుంటాడు.

రంగస్థలనటుడు, జాలరి, భగాన్ని చూషించేవాడు, జారుడిని ప్రోత్సహించేవాడు, విషాన్ని పెట్టేవాడు, ఇతరుల మీద చాడీలు చెప్పేవాడు, దున్నపోతుల్ని విక్రయించేవాడు, పర్వదినాల్లో స్త్రీ సంగమం చేసే బ్రాహ్మణుడు, గృహాలను తగులబెట్టేవాడు, మిత్రద్రోహం చేసేవాడు, శకునాలు చెప్పేవాడు, గ్రామపాచకుడు వీరందరూ "రుధిరాంధకూపం (రక్తంతో, చీకటితో కూడిన) నరకంలో పడతారు. అలాగే తేనెతుట్టుని కదిలించినవాడు, గ్రామాన్ని నాశనంచేసినవాడు 'వైతరిణి' అనే నరకానికి వెళతాడు.

వీర్యాన్ని త్రాగినవాడు, మర్యాదని ఉల్లంఘించినవాడు, ఆచారాల్ని సంప్రదాయాల్ని పాటించనివాడు, 'కృచ్ఛ్రము' అనే నరకంలో పడతారు. గొర్రెల మందల్ని పెంచుకుంటూ వాటిమీద ఆధారపడి జీవించేవారు, 'వహ్నిజ్వాలం' అనే నరకానికి వెళతారు. వ్రతలోపం చేసినవాడు, ఆశ్రమధర్మాలను పాటించనివాడు 'సందంశయాతనం' అనే నరకంలో పడతారు. ఉదయం, సాయంత్రం సమయాలలో నిద్రపోయే బ్రహ్మచారులు, పుత్రుల దగ్గర అధ్యయనం చేసినవారు, 'శ్వభోజనం' అనే నరకంలో పడతారు.

ఈ విధంగా వేలకొద్దీ నరకాలున్నాయి. పాపాలు చేసిన జీవులందరూ ఆయానరకాలకి వెళ్ళి నరకయాతనలు అనుభవిస్తారు. తమ తమ కర్మదోషాలు తీరిపోగానే మానవులు స్థావరాలు, జంగమాలు, కృములు, జలచరాలు,

పశువులు, పక్షులు, నదులు, మానవులు, దేవతలు వంటి జన్మల్ని ఎత్తి చివరికి మోక్షాన్ని పొందుతారు. దీన్నే క్రమముక్తి అంటారు.

**ప్రాయశ్చిత్తం :** స్వర్గలోకంలో ఎంతమంది జీవులుంటారో నరకంలో కూడా అంతమంది జీవులూ ఉంటారు. భూలోకంలో పాపాలు చేసి వాటికి ఎలాంటి ప్రాయశ్చిత్తం చేసుకోనివాడు నరకానికి వెళతాడు. వివిధరకాల పాపాలకి తగిన ప్రాయశ్చిత్తాలను మన మహర్షులు స్మృతి గ్రంథాలలో తెలిపారు. పెద్ద పాపాలకు పెద్ద ప్రాయశ్చిత్తాలు, చిన్న పాపాలకు చిన్న ప్రాయశ్చిత్తాలు చెప్పబడ్డాయి. స్వాయంభువ మనువులాంటి మహాపురుషులు ప్రాయశ్చిత్తకాండని రచించారు. అన్ని రకాల పాపాలకీ ఒకటే ప్రాయశ్చిత్తం శ్రీకృష్ణనామస్మరణమే.

ప్రాయశ్చిత్తం అంటే తపస్సు. పాపం చేసినవాడు ఆ పాప పరిహారం కోసం హరినామస్మరణ చేస్తే అంతకన్నా గొప్ప ప్రాయశ్చిత్తం మరేదీలేదు. అలా చేసినవాడు శ్రీమన్నారాయణుడి దివ్య పాదపద్మాల దగ్గరకు చేరుకుంటాడు. ప్రాతఃకాలంలో, సంధ్యాసమయాల్లో శ్రీహరినామస్మరణ చేసేవాడు పాప విముక్తుడవుతాడు. ఎవరి మనసు జపహోమార్చనల మీద, వాసుదేవుడిమీద లగ్నమై వుంటుందో వాడు ముక్తి పొందుతాడు. మహావిష్ణువు మీద స్థిరంగా మనసు నిలిపిన వాడికి ఎప్పుడైనా కొద్దిగా మనసు చలిస్తే అలాంటివాడికి కూడా దేవేంద్రపదవి లభిస్తుంది. కనుక పాపాలు చేసినవాడు, నిరంతరం నారాయణ నామస్మరణ చేస్తుంటే అతడి పాపాలన్నీ క్షయమైపోతాయి. ఇక అతడు నరకాన్ని చూడడు. స్వర్గం అనేది మనసుకి ఆనందాన్ని కలిగిస్తే నరకం మానవుడికి దుఃఖాన్ని కలిగిస్తుంది. స్వర్గ నరకాలంటే పుణ్యపాపాలే తప్ప మరొకటికాదు.

ఒకే వస్తువు సుఖానికీ, దుఃఖానికీ, అసూయకూ, కోపానికీ, కారణమవుతుంది. కాబట్టి ఏ వస్తువైనా దుఃఖాన్ని కలిగించేదే. ఒకప్పుడు తిరస్కరించిన వస్తువునే మరొకప్పుడు స్వీకరించవలసివస్తుంది. కనుక కేవలం దుఃఖాన్ని, కేవలం సుఖాన్ని ఇచ్చే వస్తువే వుండదు. సుఖం, దుఃఖం అనే రెండు పరిణామాలూ కేవలం మానసికమైనవి.

**బ్రహ్మజ్ఞానం :** జ్ఞానాలు రెండు రకాలు 1.లౌకికమైన జ్ఞానం 2. బ్రహ్మజ్ఞానం లౌకిక జ్ఞానం బంధనాలకి కారణమైతే బ్రహ్మజ్ఞానం ముక్తికి దారిచూపిస్తుంది. ఈ ప్రపంచ వ్యవహారమంతా జ్ఞానం వల్లే జరుగుతోంది. జ్ఞానానికి భిన్నంగా ఏదీ జరగదు. విద్య అంటే బ్రహ్మజ్ఞానం, అవిద్య అంటే లౌకిక జ్ఞానం అని తెలుసుకోవాలి. ఉపనిషత్తుల్లో చెప్పబడ్డ జ్ఞానాన్నే బ్రహ్మ జ్ఞానం అంటారు. ఇతరమైన జ్ఞానాలన్నీ కేవలం పునరావృత్తి సహితమైన స్వర్గాదుల్ని పొందటానికి ఉపకరిస్తాయి. కేవలం బ్రహ్మజ్ఞానం మాత్రమే పునరావృత్తి రహితమైన ముక్తిని ప్రసాదిస్తుంది. కనుక బ్రహ్మజ్ఞానప్రాప్తి కోసం మానవుడు తీవ్రంగా శ్రద్ధగా ప్రయత్నించాలి.

## భూలోకంలో వున్న సకల తీర్థాలు

తనచేతుల్ని, పాదాల్ని, మనసుని, స్వాధీనంలో వుంచుకున్నవాడికి, జ్ఞానం, తపస్సు, కీర్తి కలిగినవాడికి సకల తీర్థాలనూ సేవించిన ఫలితం లభిస్తుంది. మనసు, మాట పవిత్రంగా ఉన్నవాడి శరీరంలోనే అన్ని తీర్థాలూ ఉంటాయి. అపరిశుభ్రంగా వున్న కల్లుకుండని ఎన్నిసార్లు కడిగినా దాని కంపుపోనట్టు మనసు పవిత్రంగా, పరిశుద్ధంగా లేకపోతే ఎన్ని దివ్యతీర్థాల్లో మునిగినా అతడు పరిశుద్ధం కాలేడు. దుష్టస్వభావంతో ఉన్నవాడిని, విశృంఖాలంగా సంచరించేవాడిని, ఇంద్రియనిగ్రహం లేనివాడిని, తీర్థాలూ, దానాలూ, వ్రతాలు, ఆశ్రమాలు పవిత్రుణ్ణి చేయలేవు. ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకున్నవాడు ఎక్కడుంటే అదే కురుక్షేత్రం. అదే ప్రయాగతీర్థం అవుతుంది.

సూతమహర్షి శౌనకాది మునులకి భూమండలంలో వున్న సకల తీర్థాల గురించీ ఇలా చెబుతున్నాడు –

తీర్థాలలో మొదటిది పుష్కరతీర్థం. తరువాత వరుసగా ప్రసిద్ధమైన తీర్థాలు 1.నైమిశారణ్యం 2.ప్రయాగతీర్థం 3.ధర్మారణ్యం 4.ధేనుకం 5.చంపకారణ్యం 6.సైంధవారణ్యం 7.మగధారణ్యం 8.దండకారణ్యం 9.గయ 10.ప్రభాసతీర్థం 11.శ్రీతీర్థం 12.కనఖలం 13.భృగుతుంగం 14. హిరణ్యాక్షం

15.భీమారణ్యం 16.కుశస్థలి 17. లోహాకులం 18.కేదారం 19.మందరారణ్యం 20.మహాబలం 21.కోటితీర్థం 22.సర్వపాపహర తీర్థం 23.రూపతీర్థం 24.శూకరవతీర్థం 25.చక్రతీర్థం 26.యోగతీర్థం 27.సోమతీర్థం 28.సోహోటక తీర్థం 29.కోకాముఖ తీర్థం 30.బదరీ పర్వతం 31.సోమతీర్థం 32.తుంగకూటం 33.స్కందాశ్రమం 34.కోటితీర్థం 35.అగ్ని పదతీర్థం 36.పంచశిఖరతీర్థం 37.ధర్మోద్భవ తీర్థం 38.గంగాద్వారం 39.పంచకూటం 40.మధ్యకేసరం.

41.చక్రప్రభ 42.మతంగతీర్థం 43.కుశదండతీర్థం 44.దంష్ట్రాకుండం 45.విష్ణుతీర్థం 46.సర్వకామికాతీర్థం 47.మత్స్యతిలతీర్థం 48.బ్రహ్మకుండం 49.వహ్నికుండం 50.సత్యపదతీర్థం 51.చతుస్స్రోతం 52.చతుశ్శృంగం 53.ద్వాదశధారక శైలం 54.మానసం 55.స్థూలశృంగం 56.ఊర్వశీతీర్థం 57.లోకపాలం 58.సోమశైలం 59.మేరుకుండం 59.సోమాభిషేచన తీర్థం 60.మహాశ్రోతతీర్థం 61.కోటరక తీర్థం 62.అమరకంటకం 63.సాలగ్రామ తీర్థం 64.కోటిద్రుమతీర్థం 65.బిల్వప్రభాతీర్థం 66.దేవహ్రదం 67.విష్ణుహ్రదం 68.పున్నాగతీర్థం 69.దేవప్రభ 70.శంఖప్రభ 70.విద్యాధరతీర్థం 71.గాంధర్వం 72.శ్రీతీర్థం 72.బ్రహ్మహ్రదం 73.లోకపాలతీర్థం 74.పంచహ్రదం 75.పిండారక తీర్థం 76.మాలవ్య తీర్థం 77.గోప్రభావతీర్థం 78.గోవరతీర్థం 79.వటమూలక తీర్థం 80.స్నానదండ తీర్థం

81.కన్యాశ్రమం 82.వాయుకుండం 83.జంబూమార్గ తీర్థం 84.గభస్తితీర్థం 85.భద్రతీర్థం 86.మహాకాలవనం 87.వాశిష్ఠతీర్థం 88.దేర్వాసిక తీర్థం 89.ఋషితీర్థం 90.బ్రహ్మతుంగ తీర్థం 91.వసుతీర్థం 92.కుమారికా తీర్థం 93.పంచనద తీర్థం 94.రుద్రపాద తీర్థం 95.కారండవ 96.త్రివిష్టపతీర్థం 97.మణిమత్తతీర్థం 98.కామతీర్థం 99.కృష్ణతీర్థం 100.బ్రహ్మవాలుకా తీర్థం 101.పుష్యన్యాస 102.పుండరీక 103.మణిపుర 104.దీర్ఘసత్ర 105.గంగోద్భేద 106.శివోద్భేద 107.దారుబల

108.ఛాయారోహణ 109.సిద్ధేశ్వరతీర్థం 110.మిత్రబల 111.కాలికాశ్రమ 112.భద్రవట 113.కౌశాంబి 114.దివాకర తీర్థం 115.విజయతీర్థం 116.రుద్రకోటతీర్థం 117.స్యమంతపంచక తీర్థం 118.బ్రహ్మతీర్థం 119.సుదర్శన తీర్థం 120.పారిప్లవ తీర్థం

121.దశాశ్వమేధక తీర్థం 122.సర్పిజ 123.విషయాంతిక 124.వారాహ 125.యక్షిణీ 126.బదరీవన తీర్థం 127.రత్నమూలక 128 లోకద్వార 129.పంచతీర్థం 130.కపిల తీర్థం 131.సూర్య 132.శంఖినీ 133.గోభవన 134.యక్షరాజ 135.బ్రహ్మావర్త 136.సుతీర్థం 137.కామేశ్వర 138.మాతృతీర్థం 139.శీతవన 140.సప్తర్షికుండం 141.దేవీతీర్థం 142.కింజప 143.పాణిఖాత 144.మిశ్రక 145.మనోజవతీర్థం 146.కౌశికీ 147.దేవలోక 148.ఋణమోచన తీర్థం 149.దివ్యతీర్థం 150.విష్ణుపదతీర్థం 151.అమరహ్రద తీర్థం 152.శ్రీకుంజతీర్థం 153.శాలితీర్థం 154 నైమిశేయ తీర్థం 155.బ్రహ్మస్థాన తీర్థం 156.సోమకన్యాతీర్థం 157.సౌగంధిక తీర్థం 158.వనమణితీర్థం 159.సరస్వతీ తీర్థం 160. ఈశాన ప్రవర తీర్థం.

161. పావన తీర్థం 162. త్రిశూలధర తీర్థం 163.మహేంద్ర తీర్థం 164.కృతాలయతీర్థం 165.శాకంభరి తీర్థం 166.కలహ్రద తీర్థం 167.క్షీరస్రవ తీర్థం 168.విరూపాక్షతీర్థం 169.భృగుతీర్థం 170.కశోదక తీర్థం 171.బ్రహ్మయోని తీర్థం 172.నీలపర్వతతీర్థం 173.భద్రవటతీర్థం 174.స్వర్గద్వారర తీర్థం 175.కాళికాశ్రమం 176.రుద్రావర్తం 177.సుగంధాశ్వతీర్థం 178.కపిలావనతీర్థం 179.భద్రకర్ణహ్రదం 180.శంఖకర్ణహ్రదం 181.సప్తసారస్వత తీర్థం 182.కపాలమోచనతీర్థం 183.అపకీర్ణ తీర్థం 184.కామ్యకతీర్థం 185.చతుస్సాముద్రిక తీర్థం 186.రేణుకా తీర్థం 187.స్థాణుతీర్థం 189.కురుతీర్థం 190.కుశధ్వజ తీర్థం 191.విశ్వేశ్వర తీర్థం 192.నారాయణాశ్రమం 193.మాణవక తీర్థం 194.ఇంద్రమార్గతీర్థం 195.భద్రకాళీతీర్థం 196.అరుంధతీతీర్థం 197.నవబ్రహ్మావర్త తీర్థం 198.యమునా తీర్థం 199.ప్రభవతీర్థం 200.సుందరికాశ్రమ తీర్థం

201.ఉర్వీసంక్రమణ తీర్థం 202.బాహుతీర్థం 203.చారునదీతీర్థం 204.మార్కండేయతీర్థం 205.సితోదతీర్థం 206.మత్స్యోదరీతీర్థం 207.సూర్యప్రభాతీర్థం 208.అశోకవనతీర్థం 209.అరుణాస్పదతీర్థం 210.శుక్ర తీర్థం 211.పిశాచమోచనతీర్థం 212.సుభద్రాహ్రదం 213.విమలతీర్థం 214.చండేశ్వరతీర్థం 215.జ్యేష్ఠాతీర్థం 216.జైగీషవ్యగుహాతీర్థం 217.హరితీర్థం 218.కేశవనతీర్థం 220.ఘంటాకర్ణహ్రదం 221.పుండరీక హ్రదం 222.కర్కోటవాపీతీర్థం 223.శ్వేతతీర్థం 224.శ్యామాకూపం 225.చంద్రికా కుండం 226.శ్మశానస్తంభకూపం 227.వినాయక హ్రదం 228.బ్రహ్మావరతీర్థం 229.నాగతీర్థం 230.పులోమక తీర్థం 231.భక్తహ్రదం 232.ప్రేతధారా తీర్థం 233.కుమారకతీర్థం 234.బ్రహ్మావర్తం 235.శృంగమహాతీర్థం 236.సావిత్రీ హ్రదం 237.ధేనుక తీర్థం 238.కోకిలా తీర్థం 239.మతంగహ్రదం 240.పితృకూపం

241.రుద్రతీర్థం 242.శక్ర(ఇంద్ర)తీర్థం 243.సుమాలితీర్థం 244.బ్రహ్మస్థాన తీర్థం 245.సప్తకుండ తీర్థం 246.మణిరత్నహ్రదం 247.జ్యేష్ఠపాలకా హ్రదం 248.విశ్వేశ్వర తీర్థం 249.దేవకూట తీర్థం 250.వీరాశ్రమతీర్థం 251.కుమారధారాతీర్థం 251.శ్రీధారాతీర్థం 252.గౌరీశిఖరతీర్థం 253.శునఃకుండ తీర్థం 254.నందితీర్థం 257.కుమారవాసతీర్థం 258.కుంభకర్ణ హ్రదం 259.కౌశికీహ్రదం 260.ధర్మకామతీర్థం 261.ఉద్దాలక తీర్థం 262.సంధ్యాతీర్థం 263.శోణోద్భవతీర్థం 264.ఋషభకలాతీర్థం 265.పుణ్యావతీహ్రదం 266.బదరికాశ్రమ తీర్థం 267.రామతీర్థం 268.విరజాతీర్థం 269.కృష్ణతీర్థం 270.వటతీర్థం

271.రోహిణీతీర్థం 272.ప్రవరతీర్థం 273.ఇంద్రద్యుమ్నతీర్థం 274.నరతీర్థం 275.సానుగర్తతీర్థం 276.మహేంద్రతీర్థం 277.శ్రీపదతీర్థం 278.ఇషుతీర్థం 279.వార్షభతీర్థం 280.కావేరీహ్రదతీర్థం 281.గోకర్ణతీర్థం

282.గాయత్రీస్నానతీర్థం 283.విసర్ణకతీర్థం 284.కుశప్రవణతీర్థం 285.భరతతీర్థం 286.వశిష్ఠాశ్రమతీర్థం 287.రూపశీతికాతీర్థం 288.యోనిద్వారతీర్థం 289.ధేనుక తీర్థం 290.ధన్యకతీర్థం 291.సువర్ణోదపాన తీర్థం 292.మహాశ్రమతీర్థం 293.శ్రుతకోటితీర్థం 294.సకృత్తికాతీర్థం 295.సర్వదేవవ్రతతీర్థం 296.కన్యాశ్రమహ్రదం 297.వికర్ణతీర్థం 298.సానుగర్తతీర్థం 299.వాలఖిల్యమహర్షితీర్థం 300.అఖండితహ్రదం అనేవి ప్రధానమైన తీర్థాలు. ఇవిగాక ఇంకా అసంఖ్యాకమైన తీర్థాలు భూమండలమంతా విస్తరించివున్నాయి.

తీర్థేష్వేతేషు విధివత్సమ్యక్ శ్రద్ధాసమన్వితః ।
స్నానం కరోతి యోమర్త్యః సోపవాసోజితేంద్రియః ॥

దేవానృషీన్మనుషాంశ్చ పిత్రూన్ సంతర్ప్యచక్రమాత్ ।
అభ్యర్చ్యదేవతాస్తత్ర స్థిత్వాచ రజనీత్రయమ్ ॥

పృథక్ పృథక్ ఫలంతేషు ప్రతి తీరేషు భో ద్విజా ।
ప్రాప్నోతి హయమేధస్య నరోనాన్యత్ర సంశయః ॥

యస్త్విదం శృణుయాన్నిత్యం తీర్థమాహాత్మ్య ముత్తమమ్ ।
పఠయేచ్ఛ శ్రావయేద్వాపి సర్వపాపైః ప్రముచ్యతే ॥

*(శ్లో॥ 83-87, అధ్యా - 25)*

మానవుడు ఉదయాన్నే శ్రద్ధగా స్నానవిధులు నిర్వర్తించుకుని, ఉపవాసంతో దేవ, ఋషి, పితృతర్పణాలు చేయాలి. తరువాత దేవతార్చన పూర్తిచేసి మూడు రాత్రులు ఉపవాసం వుండాలి. ఈ విధంగా దీక్షగా మూడు రోజులు ఈ సర్వతీర్థాల నామాలనీ పఠిస్తే ఆయా తీర్థాల్ని దర్శించినంత పుణ్యం లభిస్తుంది. అంతేకాదు అశ్వమేధయాగం చేసిన పుణ్యం ప్రాప్తిస్తుంది. సకల పాపాలనుంచి విముక్తి కూడా లభిస్తుంది.

# భారతవర్షం

పవిత్రమైన భారత వర్షాన్ని కర్మభూమి అంటారు. బ్రాహ్మణాది మహర్షులు ఎందరో ఈ పుణ్య వర్షంలోనే నిత్యకర్మల్ని ఆచరించి సిద్ధి పొందారు. ధర్మార్థకామ మోక్షాలకు స్థానం ఈ భరతవర్షం. ఇంద్రుడు లాంటివారు కూడా ఇక్కడే తపస్సు చేసి, యాగాలు చేసి ఇంద్రపదవిని పొందారు. ఈ భారతవర్షంలోని కఠోరమైన తపస్సుచేసి, యోగ, ధ్యానాల ద్వారా మరికొందరు మహర్షులు మోక్షాన్ని పొందారు. స్వర్గంలో అమర సుఖాలనుభవిస్తున్న వారు కూడా ఒకప్పుడు ఈ పుణ్యభూమిలో సత్కర్మలు ఆచరించే స్వర్గాన్ని చేరారు. దేవతలు రాక్షసులు కూడా ఈ భరత భూమిలోనే నివసించాలని కోరుకుంటారు.

భారతవర్షంలో మొత్తం తొమ్మిది విభాగాలున్నాయి. 1.ఇంద్రద్వీపం 2.కశేరువు 3.తామ్రపర్ణం 4.గభస్తిమంతం 5.నాగద్వీపం 6.సౌమ్యం 7.గాంధర్వం 8.వారుణం 9.మిగిలిన ప్రాంతాలు. సముద్ర పరివేష్టితమైన ఈ భారతఖండంలో ఎన్నో నదులు, ఉపనదులు ఉన్నాయి.

ఈ భారతవర్షంలో పుణ్యాత్ముడైన భార్గవుడు నివసించే గోవర్ధనం ఎంతో పవిత్రమైన ప్రదేశం. ఇక్కడ వాహేక, వాటధాన, సుతీర, కాలతోయద, అపరాస్త, శూద్రా అనే నదులు వర్షాకాలంలో ప్రవహిస్తాయి. సహ్యా పర్వతానికి ఉత్తరదిశలో గోదావరి నదిపుట్టి అది ప్రవహించిన ప్రాంతమంతా భూమండలానికి ఒక సరిహద్దు.

బాహ్లిక, గాంధార, యవనసింధు, సౌవీర, మద్రక, శతద్రుహ, కళింగ, పాద, హారభూషిక, మాకర, కనక, కైకేయ, దంభమాలిక అనేవి క్షత్రియ, వైశ్యశూద్రులు నివాసముండే దేశాలు.

కాలభోజ, బర్బర, లౌకిక, వీర, తుషార, పహ్లవ, ఆధాయత, వర, ఆత్రేయ, భరద్వాజ, పుష్కల, దశేరక, లంచక, శునశ్శోకకులిక, జాంగల, ఔషధి, చల చంద్ర అనేవి కిరాతజాతి నివసించే దేశాలు.

తోమర, హంస, మార్గ, కాశ్మీర, కరుణ, శూలిక, కుహక, మాగధం అనేవి భారతదేశానికి ఉత్తర దిశలో ఉన్న దేశాలు.

భారతదేశానికి దక్షిణ పథంలో – ఆంధ్ర, వామంకరాక, బల్లక, మఖాంతక, అంగ, వంగ, మలద, ఋత్తిక, భద్రతుంగ, ప్రతిజయ, దర్భాంగ, అపమర్దక, ప్రాగ్జోతిష, మద్ర, విదేహ, తామ్ర, తిప్తక, మల్ల మగధక, నందం అనే దేశాలున్నాయి. అలాగే పూర్ణకేవల గోలాంగూల, ఋషిక, ముషిక, కుమార, రామఠ, శక, మహారాష్ట్ర, మాహిషక, కళింగ, అభీర, వైళిక్య, అటప్య, సభవ, పుళింద, మౌలేయ, వైదర్భ, దండక, పౌలిక, మౌలిక,అశ్మక భోజ, వర్ధన, కాలిక, కుంతల, దంభక, నీల, కాలక అనేవి దక్షిణ భాగంలో వున్న దేశాలు.

శూరినక, కాలిధనలోల, తాటంక అనే దేశాలు అపరాంతదేశాలని చెప్పబడతాయి. మలజ, కర్కశ, మేలక, జోళక, ఉత్తమర్ణ, దశార్ణ, భోజ, కిష్కింధ, తోషల, కోశల, త్రైపుర, వైదిశ, తుంబుర, చర, యవన, పవన, అభయ, రుండికేర, బర్బర, హోత్ర అనేవి వింధ్య పర్వత ప్రాంతంలోని దేశాలు.

నీహార, తుషమార్గ, కురు, తంగణ, స్వపకర్ణ,ప్రావరణ, ఊర్ణ, దర్భ, కుంతక, చిత్రమార్గ, మాలవాకిరాత, తోమర అనేవి పర్వతాల్ని ఆశ్రయించుకుని వున్న దేశాలు. ఈ ప్రదేశాలలో చతుర్యుగధర్మం నడుస్తుంది. ఈ భారత వర్షానికే తూర్పు దక్షిణాన మహోదధి అనే సముద్రం వుంది. ఉత్తర దిశలో హిమవత్పర్వతం నెలకొంది.ఇది సర్వబీజం వంటిది. సకల జీవులు కర్మల్ని ఆచరించి వాటి ఫలితాల్ని అనుభవించటం కోసం తగిన స్థానం ఇదే.

ఈ పుణ్యభారతావనిలో దేవతలు కూడా మానవ జన్మఎత్తి సత్కర్మల్ని ఆచరించి తత్పలితంగా పుణ్యలోకాల్ని చేరాలనుకుంటారు. ఇది తపస్సు చేసేవారికి తగిన ఫలాల్ని ఇచ్చే దేశం. తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనం, దేవతారాధన, యజ్ఞయాగాదిపుణ్యకర్మలని ఆచరించతగ్గ ప్రదేశం భరతభూమి. బ్రహ్మచర్యాది ఆశ్రమాలు, వ్రతాలు, నోములు వంటివి ఇక్కడ సఫలమౌతాయి. ఎంతో పవిత్రమైన ఈ భారత వర్ష ప్రశంశని పఠించినా విన్నా సర్వపాపాల నుంచీ విముక్తులై విష్ణులోకానికి చేరుకుంటారు.

# కోణాదిత్య (కోణార్క్) క్షేత్ర మాహాత్మ్యం

భారతదేశంలో దక్షిణ సముద్ర తీరాన ఓఢ్ర (ఒరిస్సా) దేశం వుంది. అది మోక్ష భూమి. సముద్ర తీరానికి ఉత్తర దిశలో వున్న విరజామండలం సరిహద్దుల దాకా ఓఢ్రదేశం నెలకొని వుంది. ఆ దేశంలో వుండే బ్రాహ్మణులు పండితులు, స్వాధ్యాయపరులు, పూజనీయులు, యజ్ఞ, దాన, వివాహ, ఉపనయన, శ్రాద్ధకర్మలు శాస్త్రోక్తంగా చేయగలిగిన వారు. షట్కర్మ (యజనం- యాజనం- అధ్యయనం-అధ్యాపనం, దానం-ప్రతి గ్రహణం) నిరతులు. ఇతిహాసపురాణ, శాస్త్ర కోవిదులు. ఒకటేమిటి సకల సద్గుణవంతులు. అక్కడ వుండే బ్రాహ్మణులే కాదు క్షత్రియాది వర్ణాలవారు కూడా ధర్మనిరతులు.

ఎంతో పవిత్రమైన ఆ ఓఢ్ర దేశంలో కోణాదిత్యుడు అనే పేరుతో సూర్యభగవానుడు వెలిసాడు. ఆయన్ని దర్శిస్తే చాలు పాపాలన్నీ పటాపంచలై పోతాయి. ఆ ఆలయ ప్రాంగణం దాని పరిసరాలు మొత్తం అర్ధయోజనం కొలతలతో వుంటాయి. అక్కడి సూర్యక్షేత్రం ఎంతో మహిమాన్వితమైనది. దర్శించిన భక్తులకి ముక్తిని ప్రసాదిస్తుంది.

మాఘమాసం సూర్యుడికి ప్రీతికరం. అందుకే ఆ మాసంలో శుక్లపక్ష సప్తమి (రథసప్తమి) నాడు తెల్లవారు ఝామునే లేచి సూర్యదేవాలయానికి దగ్గరలో వున్న సముద్రంలో స్నానం చేసి, దేవ,ఋషి పితృతర్పణాలు సమర్పించాలి. తరువాత తెల్లని వస్త్రాలు ధరించి సముద్రతీరంలో సుఖంగా కూర్చుని ఎనిమిది రేకులతో ఒక పద్మాకారాన్ని ఎర్రని వర్ణంతో లిఖించాలి. (అష్టదళపద్మం) దానికి మధ్యలో కర్ణిక కూడా వుండాలి. శుచిగా ఆచమనం చేసి ఎర్రచందనం, నువ్వులు, బియ్యం, ఎర్రనిపూలు, దర్భలు ఒక రాగి పాత్రలో ఉంచి అందులో నీళ్ళుపోసి ఆ పాత్రని మరో పాత్రతో మూసివేయాలి. అప్పుడు తిరిగి ఆచమనం అంగన్యాస కరన్యాసాలు చేసి భాస్కరుణ్ణి ధ్యానించాలి. ఆ అష్టదళపద్మానికి నైరృతి, ఆగ్నేయ, వాయవ్య, ఈశాన్య దిశలో మధ్యలో భక్తిగా పూజించాలి.

అష్టదళపద్మాన్ని ఆరాధించిన తరువాత ఆకాశం నుంచి ఆదిత్యుణ్ణి తామర పువ్వు మధ్యలో వున్న కర్ణిక మీదకి ఆవాహన చేయాలి. తరువాత ముద్రల్ని ప్రదర్శించి

పింగాక్షం ద్విభుజం రక్తం పద్మపత్రారుణాంబరమ్ ।
సర్వలక్షణ సంయుక్తం సర్వాభరణ భూషితమ్ ॥ 1
సురూపం వరదం శాంతం ప్రభామండల మండితమ్ ।
ఉద్యంతం భాస్కరం దృష్ట్వా సాంద్రసింధూర సన్నిభమ్ ॥ 2

*(శ్లో॥ 30-31, అధ్యా 28)*

రెండు భుజాలతో, తేనెరంగుకళ్ళతో అరుణ పద్మంలాంటి వస్త్రాల్ని ధరించి, సర్వాభరణ భూషితుడుగా, సర్వలక్షణ సంపన్నుడుగా, శాంతమూర్తిగా, వరముద్రని ధరించిన వాడిగా, ప్రభామండలంలో ప్రకాశించేవాడిగా, ఆ సూర్య భగవానుణ్ణి ధ్యానించాలి. తరువాత మోకాళ్ళ మీద కూర్చుని పూజాద్రవ్యాలు ఉంచి మూతపెట్టిన పాత్రని పైకి ఎత్తి పట్టుకుని తలమీద ఉంచి, త్ర్యక్షర (మూడు అక్షరాల) మంత్రంతో సూర్యుడికి, అర్ఘ్యం /బీఇవ్వాలి. సూర్యమంత్రాన్ని ఉపదేశం పొందని వారు 'ఓం సూర్యాయ నమః తర్పయామి' అని సూర్యుడి పేరు ఉచ్చరించి తర్పణం ఇవ్వవచ్చు.

ఈ విధంగా తర్పణం చేసిన తరువాత ఆగ్నేయ, నైఋతి, వాయువ్య, ఈశాన్య, మధ్య, తూర్పుదిశల్లో హృదయం శిరస్సు, శిఖ, కవచ, నేత్ర, అస్త్ర మంత్రాలతో పద్మంలోకి ఆవాహనం చేసిన సూర్యుణ్ణి పూజించాలి. పూజానంతరం బెల్లంతో వండిన పొంగలిని నైవేద్యం పెట్టి సూర్యమంత్రాన్ని యథాశక్తి జపించి తిరిగి ముద్రల్ని ప్రదర్శించి విసర్జన చెప్పాలి. భక్తిగా ఎవరైతే సూర్యుడికి ఈ విధంగా తర్పణం పూజచేస్తారో వారికి త్రైలోక్య దీపకారకుడైన సూర్యభగవానుడు, ఆయురారోగ్య ఐశ్వర్యాలని ప్రసాదిస్తాడు. సుఖాల్ని కోరుకునే మానవులు, సూర్యుణ్ణి పూజించకుండా శివకేశవుల్ని పూజించకూడదు.

సముద్రతీరంలో ఈ విధంగా అర్ఘ్య పూజల్ని నిర్వర్తించాక ఎర్రనిపుష్పాలు తీసుకుని కోణాదిత్యుడి ఆలయంలోకి వెళ్ళాలి. ముందుగా ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసి, తరువాత ఆలయం లోపలికి వెళ్ళి స్వామిని పూలతో పూజించాలి. ఇలా చేసిన భక్తుడు మరణానంతరం సూర్యలోకానికి చేరుకుంటాడు. అతడికి దశాశ్వమేథయాగాలు చేసిన ఫలితం లభిస్తుంది. ఈ దివ్యాలయాన్ని శయన, ఉత్థాన ఏకాదశీ తిథుల్లో, భానుసంక్రమణ తిథుల్లో, సప్తమీ ఆదివారం వచ్చిన రోజుల్లో దర్శించి అర్ఘ్య పూజాదికాలు నిర్వహిస్తే సకల శుభాలు కలుగుతాయి.

కోణాదిత్య (కోణార్క) క్షేత్రం ఎంతో మహిమాన్వితమైనది. అక్కడి సముద్రతీరంలో రామేశ్వరుడనే పేరుతో ఒక శివాలయం కూడా ఉంది. ఆ రామేశ్వరుణ్ణి అర్చించిన వారికి రాజసూయయాగఫలం లభిస్తుంది. ఈ దివ్యక్షేత్రంలో ఎవరైనా మరణిస్తే సూర్యలోకాన్ని చేరుకుంటాడు. తిరిగి అతడు మానవజన్మ ఎత్తి ధర్మపరిరక్షణ చేసే మహారాజవుతాడు. ఇది కోణాదిత్య క్షేత్రమహిమ.

## సూర్యుడి పూజావిధానం - ఫలితాలు

భక్తితో సూర్యుడి చుట్టూ 12 ప్రదక్షిణాలు చేస్తే ఆయన ఎంతో సంతోషిస్తాడు. సూర్యుడికి చేసిన ప్రదక్షిణం భూమండలం చుట్టూ చేసిన ప్రదక్షిణతో సమానం. అంతేకాదు సకల దేవతలకీ ప్రదక్షిణ చేసిన ఫలితం కూడా లభిస్తుంది. షష్ఠి తిథి లేక సప్తమీ తిథి నాడు గానీ ఏకభుక్తంతో ఉపవాసదీక్ష వహించి సూర్యుణ్ణి అర్చిస్తే అశ్వమేథఫలం లభిస్తుంది. కృష్ణపక్ష సప్తమి తిథినాడు ఆయన్ని అర్చిస్తే పద్మంలా ప్రకాశించే దివ్య విమానాన్ని ఎక్కి సూర్యలోకానికి వెళ్ళే యోగ్యత లభిస్తుంది. శుక్ల పక్ష సప్తమినాడు ఉపవాసం ఉండి తెల్లని పూలతో ఆయన్ని పూజిస్తే ముందు చెప్పిన ఫలితమే కలుగుతుంది.

రాగి పాత్రలో నీరు పోసి ఆ నీటిని క్రమంగా ఒక్కొక్కటీ పెంచుతూ ఇరవై నాలుగు రోజులు ఆ పాత్రల్లోని నీటిని త్రాగాలి. ఇరవై నాలుగు రోజుల

తరువాత తిరిగి 24 పాత్రల నుంచి 1 పాత్ర వరకూ తగ్గించుకుంటూ అందులో నింపిన నీటిని త్రాగాలి. ఈవిధంగా రెండు సంవత్సరాలు చేస్తే వ్రతం సమాప్త మవుతుంది. దీనినే సూర్య సప్తమీ వ్రతం అంటారు. (పాత్ర చిన్నది అయి వుండాలి) శుక్లపక్షసప్తమీ ఆదివారం కలిసి వస్తే దాన్ని విజయ సప్తమి అంటారు. ఆ రోజు జపం, ధ్యానం, దానం, హోమం, ఏది చేసినా విజయం లభిస్తుంది.

ఆదివారం నాడు పితృదేవతలకి శ్రాద్ధం పెట్టినా, తెల్లజిల్లేడుతో హోమం చేసినా, అభీష్ట సిద్ధి కలుగుతుంది. వారి వంశంలో అనారోగ్యంతో వుండేవాడు, దరిద్రుడు ఎప్పటికీ జన్మించడు. తెలుపు, ఎరుపు, పసుపుపచ్చ రంగులో వుండే మట్టిని వంటికి పూసుకునేవాడికి, చిత్ర విచిత్రమైన రంగురంగుల పూలతో చిత్రభానుణ్ణి అర్చించి ఉపవాసం ఉండిన వాడికి కోరిన కోరికలు నెరవేరతాయి. ఆవునెయ్యి లేక నువ్వులనూనెతో గానీ దీపాన్ని వెలిగించి సూర్యుణ్ణి పూజించిన వారికి కంటి జబ్బులు రావు. దీపాన్ని దానం చేసినవాడికి జ్ఞానం వృద్ధి చెందుతుంది. నువ్వులతో సహా గోదానం చేస్తే అది ఎంతో పుణ్య ప్రదం. నాలుగు దారులు కలిసేచోట, రాజమార్గాలతో దీపదానం చేసినవాడు భాగ్యవంతుడవుతాడు.

దీపం ఎప్పుడూ ఊర్ధ్వముఖంగానే వెలుగుని ప్రసరిస్తూ వుంటుంది. కనుక దీపదానం చేసినవాడికి ఉత్తమగతేగానీ అధోగతి ఎప్పటికీ వుండదు. దీపం ఎంతో పవిత్రమైనది. అందుకే వెలుగుతున్న దీపాన్ని తగ్గించకూడదు. ఆర్పేయకూడదు. అలా ఎవరైనా చేస్తే బంధనాలు, వినాశనం పొందుతాడు. దీపదానం చేసినవాడు స్వర్గలోకంలో ప్రకాశిస్తాడు. కుంకుమ, ఎర్రచందనం, అగరు, ఎర్రటి పుష్పాలు ఉపయోగించి సూర్యభగవానుణ్ణి అర్చించినవాడు, ఆయనకి అర్ఘ్యాలు సమర్పించినవాడు ఒక సంవత్సరంలో ఇష్టసిద్ధిని పొందగలుగుతాడు.

సూర్య భగవానుడిని ఉద్దేశించి ఉదయం నించి ఆయన అస్తమించేదేకా నిల్చుని సూర్యమంత్రాన్ని జపించినా, సూర్యస్తోత్రాన్ని పఠించిన సకల పాపాల నుంచీ విముక్తి కలుగుతుంది. దీన్నే ఆదిత్యవ్రతం అంటారు. సూర్యుడికి

అర్ఘ్యాన్ని కుడివైపుగానీ, ఎడమవైపుగానీ ఇవ్వకూడదు. ఆయనకి ఎదురుగా నిలబడి అర్ఘ్యప్రదానం చేయాలి. సూర్యుడికి ప్రీతికరమైన గుగ్గులుకర్ర, మారేడు, దేవదారు చెట్టు కర్రలతో చేసిన నలుపలకల ఆసనాన్ని సమర్పించాలి. తరువాత కర్పూరం అగరులతో ఆయనకి ధూపాన్ని వేయాలి. అలా చేసినవాడికి స్వర్గప్రాప్తి కలుగుతుంది.

రాత్రి పగలు సమానంగా వున్న రోజు సూర్యుణ్ణి అర్చిస్తే సకల దురితాలు నివారించబడతాయి. పులగం, పాయసం, ఆవుపాలు, పళ్ళు, దుంపలు, నెయ్యి సూర్యుడికి ప్రీతికరమైనవి. వీటితో ఆయనకి నైవేద్యం సమర్పిస్తే సర్వకామ్యాలూ సిద్ధిస్తాయి. ఆవునెయ్యితో సూర్యుడికి తర్పణం విడిస్తే సర్వసిద్ధులు కలుగుతాయి. ఆవుపాలతో తర్పణం చేస్తే మనఃస్తాపాలు హరిస్తాయి. ఆవుపెరుగుతో చేస్తే సకలకార్యసిద్ధి కలుగుతుంది. పవిత్ర జలంతో సూర్యుడికి స్నానం చేయిస్తే పరమపదం ప్రాప్తిస్తుంది. ఏ ద్రవ్యం సూర్యుడికి మనం సమర్పిస్తే ఆ ద్రవ్యం అనంతంగా మనకి ప్రాప్తిస్తుంది.

## సూర్యుడి అష్టోత్తర శతనామస్తోత్రం

ఓం సూర్యో ఽర్యమా భగస్త్వష్టా పూషాఽర్కః సవితా రవిః ।
గభస్తిమా నజః కాఓ మృత్యుర్ధాతా ప్రభాకరః ॥

పృథివ్యాపశ్చ తేజశ్చ ఖం వాయుశ్చ పరాయణం ।
సోమో బృహస్పతిః శుక్రో బుధో ఽంగారక ఏవచ ॥

ఇంద్రో వివస్వాన్ దీప్తాంశుః శుచిః శౌరిః శనైశ్చరః ।
బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ స్కందో వైశ్రవణో యమః ॥

వైద్యుతో జాఠర శ్చాగ్ని రైంధన స్తేజసాం పతిః ।
ధర్మధ్వజో వేదకర్తా వేదాంగో వేదవాహనః ॥

కృతం త్రేతా ద్వాపరశ్చ కలిః సర్వామరాశ్రయః ।
కలా కాష్ఠా ముహూర్తాశ్చ క్షపా యామా స్తథా క్షణాః ॥

వ్యాస మహర్షి రచించిన

# శ్రీ పద్మ పురాణం



వచనం. డా. జయంతి చక్రవర్తి

నిత్ర 2021 క్యాలెండర్

Download Nithra Calendar Click Here

http://bit.ly/ntecpdf



# 3+ Million Downloads

తెలుగు లో No.1 క్యాలెండర్

# నిత్ర తెలుగు క్యాలెండర్

యాప్‌ను ఉపయోగించవలసినవారు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి. లేదా bit.ly/telugucalendar2020 ని ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోగలరు.

- రోజు వీక్షణ / మాస వీక్షణ
- పంచాంగం
- శుభ ముహూర్తాలు
- దిన రాశి ఫలాలు
- పండుగలు మరియు సెలవు దినములు
- నోములు మరియు వ్రతాలు - 116
- ఉపవాస దినములు
- గౌరీ పంచాంగం / హోర చక్రము
- స్మార్ట్ టూల్స్ / రక్తదానం
- వాస్తు టిప్స్
- పద్యములు / శ్లోకాలు మరియు పురాణాలు
- పొడుపు కథలు / సామెతలు
- శిశు జనన పాద దోషములు
- నవరత్నములు
- నామకరణం
- బల్లిశాస్త్రము
- వివాహ మ్యాచింగ్
- అష్టమి / నవమి
- ముహూర్త విజ్ఞానము




నిత్ర తెలుగు క్యాలెండర్

అంతర్జాతీయ క్యాలెండర్‌లు

ప్రతివారం యూట్యూబ్‌లో శ్రీ కప్పగన్తు సుబ్బరామ సోమయాజులు గారి వారఫలాలు మరియు పండుగ విశేషాలు

ప్రతిరోజూ ఆ రోజూ విశేషాలతో నోటిఫికేషన్లు మొదలైన మరెన్నో విషయములు గురించి తెలుగులో మీకు ఈ యాప్‌లో లభించును.

# పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



# విషయసూచిక


పద్మపురాణంలో చెప్పిన ప్రధాన విషయాలు 15
పద్మపురాణ ప్రాశస్త్యం 17
క్షీరసాగర మథనం 18
మహాలక్ష్మి ఆవిర్భావం 21
దక్షుడు చేసిన సృష్టి 23
కశ్యప వంశం 24
వినత సంతానం 26
కద్రువ సంతానం 26
కశ్యపుడి ఇతర సంతానం 26
జ్యేష్ఠపూర్ణిమా వ్రతం 27
గర్భిణీస్త్రీలు పాటించాల్సిన నియమాలు 29
మన్వంతరాలు 30
పృథు మహారాజు కథ 32
పితృవంశాల చరిత్ర 34
కర్ణ-అర్జునుల జన్మవృత్తాంతం 38
దేవతలు చేసిన రుద్రస్తుతి 43
శంకరుడు చేసిన బ్రహ్మస్తుతి 44
శంకరుడు చేసిన శ్రీహరి స్తవం 45
బ్రహ్మ సభా వర్ణనం 46
దేవతలు చేసిన బ్రహ్మస్తుతి 49
త్రివిధ భక్తి స్వరూపం 54
గురుసేవా విధానం 56
గృహస్థ ధర్మం 57
ఉత్తమ బ్రాహ్మణుడి లక్షణం 57
యజ్ఞ పరిభాష 58
దేవీ క్షేత్రతీర్థ ప్రశంశ 59
గాయత్రీ దేవి వరదానం 63
గాయత్రీమంత్ర ఫలం 64
శంకరకృత గాయత్రీ స్తుతి 65
బ్రహ్మ చేసిన యజ్ఞ వైభవం 68
నారాయణుడు చేసిన బ్రహ్మస్తుతి 68
సరస్వతీ తీర్థ మహిమ 70
అగస్త్యుడు సముద్రాన్ని త్రాగటం 71
దేవతలు చేసిన అగస్త్య స్తుతి 73
సప్తర్షి ఆశ్రమం 74
ఋషులు చెప్పిన ధర్మం 75
ధనం గురించి మహర్షుల అభిప్రాయం 76
ఆకలితో ఉన్నవాడి స్థితి 79
అన్నదాన విధి 80
వృక్షాలు-అవి ఇచ్చే ఫలితాలు 80
సౌభాగ్య శయన వ్రతం 81
నాగ తీర్థం 84
శివదూతీ చరిత్ర 87
శివుడు చేసిన శివదూతీ స్తుతి 89
శ్రీరాముడు చేసిన శంకరస్తుతి 92
రాముడు చేసిన శివస్తుతి 92
బ్రహ్మదేవుడి వరప్రదానం 94
శ్రీహరి చేసిన బ్రహ్మ స్తుతి 95
రుద్రుడు చేసిన బ్రహ్మ స్తుతి 96
భూలోకంలో బ్రహ్మ క్షేత్రాలు 98
గోపూజా మంత్రం 100
ప్రహ్లాదుడి పూర్వజన్మ వృత్తాంతం-శివశర్మ చరిత్ర 100
ధర్మోపాఖ్యానం 109
సోమశర్మ వృత్తాంతం 113
సోమశర్మ చేసిన శ్రీహరి స్తవం 114
అంగుడు చేసిన వాసుదేవ స్తుతి 119
వాసుదేవ స్తుతి 120
దాన మాహాత్మ్యం 122
మాతాపితల సేవాఫలం 127
బ్రహ్మ ఘాతకులు 129
పాపులు-పాపాలు 130
సుకృత కర్మ ఫలం 132
తులసీ మాహాత్మ్యం 134
ఉసిరికాయ ప్రాశస్త్యం 134
పద్మపురాణం ఫలశ్రుతి 136

# ఉపోద్ఘాతము

అం.ఆ

**వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ ।**
**నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా ॥**

**వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥**

## అష్టాదశ పురాణాలు

మన భారతవాఙ్మయంలో వేదాల తరువాత అంతటి ప్రాశస్త్యాన్ని పొందిన గ్రంథాలు పురాణాలు. వేదాల్లో చెప్పిన ధర్మాల్ని కథలరూపంలో, ఆఖ్యానాల రూపంలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలియచెప్పేవే పురాణాలు. అందుకే పురాణాల్ని పంచమవేదంగా కీర్తించారు. అసలు పురాణం అంటే? పురా పినవం-పురాతనమైనప్పటికీ నూతనంగా వుండేది అని అర్థం. అలాగే 'పురా ఆనతి' అంటే ప్రాచీనకాలంలో జరిగింది అని, వాయుపురాణం పురాణశబ్దాన్ని నిర్వచిస్తే, 'పురాఏతత్ అభూత్' పూర్వం ఇలా జరిగింది అని బ్రహ్మాండ పురాణం పురాణశబ్దానికి అర్థాన్ని చెబుతుంది. వీటన్నిటినీ క్రోడీకరించి చూస్తే పురాణం అంటే పూర్వకాలంలో జరిగిన ఎన్నో విషయాల్ని వివరించి చెప్పేది అని తెలుస్తోంది.

పురాణాలు ఎన్ని-

పురాణాలు మహాపురాణాలు, ఉపపురాణాలని రెండు విధాలుగా వున్నాయి. మహాపురాణాలు 18, అలాగే ఉపపురాణాలు 18.

**బ్రహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవచ ।**
**భాగవతం నారదదీయం మార్కండేయంచ కీర్తితమ్ ॥**

**ఆగ్నేయంచ భవిష్యంచ బ్రహ్మవైవర్త లింగకే ।**
**వారాహంచ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।**
**మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥**

1.బ్రహ్మపురాణం 2.పద్మపురాణం 3.విష్ణుపురాణం 4.వాయు పురాణం 5.భాగవత పురాణం 6.నారదపురాణం 7.మార్కండేయ పురాణం

8.అగ్నిపురాణం 9.భవిష్యపురాణం 10.బ్రహ్మవైవర్త పురాణం 11.లింగపురాణం 12. వరాహ పురాణం 13.స్కాంద పురాణం 14.వామన పురాణం 15.కూర్మ పురాణం 16.మత్స్య పురాణం 17.గరుడ పురాణం 18.బ్రహ్మాండ పురాణం- ఈ పద్దెనిమిదీ మహాపురాణాలు. అలాగే 18 ఉపపురాణాలు కూడా వున్నాయి. ఈ మహాపురాణాల పేర్లని గుర్తుంచుకోవటానికి శ్లోకం కూడా వుంది.

**'మ' ద్వయం 'భ' ద్వయం చైవ 'బ్ర'త్రయం 'వ' చతుష్టయం ।**
**అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్ ॥**

'మ' తో మొదలయ్యేవి రెండు 1.మత్స్య 2.మార్కండేయ

'భ' తో మొదలయ్యేవి రెండు 1.భాగవత 2.భవిష్య

'బ్ర' తో మొదలయ్యేవి మూడు 1.బ్రహ్మ 2.బ్రహ్మవైవర్త 3.బ్రహ్మాండ

'వ' తో మొదలయ్యేవి నాలుగు 1.వాయు 2.విష్ణు 3.వామన 4.వరాహ

అ-అగ్ని, నా-నారద, ప-పద్మ, లిం-లింగ, గ-గరుడ, కూ-కూర్మ, స్కా-స్కాంద ఇలా మొత్తం పద్దెనిమిది పురాణాలు.

## పురాణాలు విష్ణుస్వరూపం

అష్టాదశ పురాణాలను సాక్షాత్తు విష్ణు స్వరూపంగా పోల్చారు. 18 పురాణాలని మహావిష్ణువు శరీరంలోని 18 అంగాలుగా భావిస్తారు మన ప్రాచీన ఋషులు.

1. బ్రహ్మపురాణం - శ్రీ మహావిష్ణువు శిరస్సు
2. పద్మపురాణం - శ్రీ మహావిష్ణువు హృదయం
3. విష్ణుపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిభుజం
4. వాయుపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమభుజం
5. భాగవతపురాణం - శ్రీ మహావిష్ణువు ఊరువులు
6. నారదపురాణం - శ్రీ మహావిష్ణువు నాభి
7. మార్కండేయపురాణం - శ్రీ మహావిష్ణువు కుడిపాదం
8. అగ్నిపురాణం - శ్రీ మహావిష్ణువు ఎడమపాదం

| | | | |
|---|---|---|---|
| 9. | భవిష్యపురాణం | - | శ్రీ మహావిష్ణువు కుడిమోకాలు |
| 10. | బ్రహ్మవైవర్తపురాణం | - | శ్రీ మహావిష్ణువు ఎడమమోకాలు |
| 11. | లింగపురాణం | - | శ్రీ మహావిష్ణువు కుడి చీలమండ |
| 12. | వరాహపురాణం | - | శ్రీ మహావిష్ణువు ఎడమ చీలమండ |
| 13. | స్కందపురాణం | - | శ్రీ మహావిష్ణువు కేశాలు |
| 14. | వామనపురాణం | - | శ్రీ మహావిష్ణువు చర్మం |
| 15. | కూర్మపురాణం | - | శ్రీ మహావిష్ణువు పృష్ఠభాగం |
| 16. | మత్స్యపురాణం | - | శ్రీ మహావిష్ణువు మెదడు |
| 17. | గరుడపురాణం | - | శ్రీ మహావిష్ణువు మాంససారం |
| 18. | బ్రహ్మాండపురాణం | - | శ్రీ మహావిష్ణువు ఎముకలు |

పురాణ లక్షణం :-

**సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వంత రాణి చ ।**
**వంశానుచరితం చేతి పురాణం పంచ లక్షణం ॥**

పురాణానికి ఐదు లక్షణాలు ప్రధానంగా వుండాలని చెప్పారు. 1.సర్గ-అంటే ప్రపంచ సృష్టి, 2.ప్రతిసర్గ-ఈ ప్రపంచ ప్రళయం, 3.వంశం-రాజుల, ఋషుల, దేవతలకు సంబంధించిన వంశ విశేషాలు-అవతారాలు 4.వంశానుచరితం-రాజవంశాలలో, ఋషుల వంశాలలో పుట్టిన వారి జీవితచరిత్రలు, 5.మన్వంతరాలు-మనువులు, మనువు ద్వారా ఏర్పడ్డ సంతతి, ఆయా మన్వంతరాలలో జరిగిన విశేషాలు. ఈ విధంగా ప్రతిపురాణం పంచలక్షణాలతో కూడి వుంటుంది.

పురాణకర్త :-

**విష్ణోరంశో మునిర్జాత సత్యవత్యాం పరాశరాత్ ।**
**పురాణ సంహితాం దద్యే తేషాం ధర్మ విధిత్సయా ॥**

అనే ఈ ప్రమాణ శ్లోకం ప్రకారం సత్యవతీ పరాశర మహర్షి కుమారుడుగా శ్రీ మహావిష్ణు అంశంతో జన్మించిన వ్యాసుడే అష్టాదశ పురాణాల కర్త అని తెలుస్తోంది. ఈయననే కృష్ణద్వైపాయనుడు అని కూడా అంటారు. పురాణాలకు కర్త వ్యాసుడైతే వక్త సూతమహర్షి. ఈయన నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు ఈ పురాణాలన్నిటినీ ప్రబోధించాడు.

పురాణాల ప్రాచీనత :-

వేద వాఙ్మయం ఎంత విస్తృతంగా వుందో, పురాణ వాఙ్మయం కూడా అంత విస్తృతంగా వుంది. సాధారణంగా లోకంలో వేదాలు అత్యంత ప్రాచీనమైనవని చెబుతారు. అయితే ఈ శ్లోకం వేదాలకన్నా పురాణాలే ప్రాచీనమైనవని చెబుతుంది.

**పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతమ్ ।**
**నిత్యం శబ్దమయం పుణ్యం శతకోటి ప్రవిస్తరమ్ ।**
**అనంతరంచ వక్త్రేభ్యః వేదాంతస్య వినిర్గతాః ॥**

పూర్వం బ్రహ్మ నోటి నుంచి వందకోట్ల శ్లోకాలతో ముందు పురాణాలు బయలుదేరి ఆ తరువాత వేదాలు బయలుదేరాయట. ఇలా వందకోట్ల శ్లోకాలతో చతుర్ముఖ బ్రహ్మతో చెప్పబడ్డ పురాణం మొత్తం ఒక్కటిగానే వుండేది. అల్పబుద్ధులైన మానవుల కోసం ఆ బ్రహ్మదేవుడే వ్యాసుడి రూపంలో వచ్చి ఆ కోటిశ్లోకాల పురాణాన్ని నాలుగు లక్షల శ్లోకాలలోకి కుదించి దాన్ని పద్దెనిమిది పురాణాలుగా రచించాడని స్కందపురాణం చెబుతుంది.

**పురాణమేక మేవాసీ దస్మిన్ కల్పాంతరే నృప ।**
**త్రివర్గ సాధనం పుణ్యం శతకోటి ప్రవిస్తరమ్ ॥**
**స్మృత్వా జగాదచ మునీన్ ప్రతి దేవశ్చతుర్ముఖః ।**
**చతుర్లక్ష ప్రమాణేన ద్వాపరే ద్వాపరే సదా ।**
**తదష్టాదశధా కృత్వా భూర్లోకేఽ స్మిన్ ప్రభాష్యతే ॥** *(స్కంద పురాణం)*

## పాఠకులకు నమస్కారం

భగవాన్ వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలు ఆర్షవిద్యా భాండాగారాలు. ఆ భాండాగారాలలో నిక్షిప్తమైన ప్రధాన విషయాల్ని 18 పుస్తకాలుగా క్రోడీకరించి మీ ముందుకు తెస్తున్నాం. సరళమైన భాషలో మేము ప్రచురించిన ఈ 18 పురాణాలని ఆదరించి, మమ్మల్ని ప్రోత్సహిస్తారని ఆశిస్తూ... మీ

***- ప్రకాశకులు, వచనకర్త***

# అష్టాదశ పురాణాల మొదటి వక్త - శ్రోత

అష్టాదశ పురాణాలను మొదటగా చెప్పిన వక్తలు వారి నుంచి మొదటిసారి విన్న శ్రోతలు ఈ క్రింద చెప్పిన విధంగా వుంటారు. అదేవిధంగా ఒక్కొక్క పురాణానికి వక్తృ శ్రోతృపరంపర వేరువేరు విధాలుగా ఉండవచ్చు.

| సం. పురాణం | ఏకల్ప వృత్తాంతం | వక్తృశ్రోతలు |
|---|---|---|
| 1. బ్రహ్మ పురాణాన్ని | బ్రహ్మ కల్పంలో | బ్రహ్మ మరీచి మహామునికి బోధించాడు |
| 2. పద్మ పురాణాన్ని | పద్మ కల్పంలో | స్వాయంభువమనువు బ్రహ్మకు బోధించాడు |
| 3. విష్ణు పురాణాన్ని | వరాహ కల్పంలో | పరాశరుడు బ్రహ్మకు బోధించాడు |
| 4. శివ(వాయు)పురాణాన్ని | శ్వేత కల్పంలో | శివుడు వాయువుకు బోధించాడు |
| 5. భాగవత పురాణాన్ని | సారస్వత కల్పంలో | విష్ణువు బ్రహ్మకు బోధించాడు |
| 6. నారద పురాణాన్ని | బృహత్ కల్పంలో | పూర్వ భాగాన్ని – సనకాదులు నారదునికి బోధించారు. ఉత్తరభాగాన్ని – వశిష్ఠుడు మాంధాతకు బోధించాడు |
| 7. మార్కండేయ పురాణాన్ని | శ్వేత వారాహకల్పంలో | మార్కండేయుడు జైమినికి బోధించాడు |
| 8. అగ్ని పురాణాన్ని | ఈశాన కల్పంలో | అగ్నిదేవుడు వశిష్ఠునికి బోధించాడు |
| 9. భవిష్య పురాణాన్ని | అఘోర కల్పంలో | బ్రహ్మ మనువుకు బోధించాడు |
| 10. బ్రహ్మవైవర్త పురాణాన్ని | రథంతర కల్పంలో | సావర్ణి నారదునికి బోధించాడు |
| 11. లింగ పురాణాన్ని | కల్పాంత కల్పంలో | పరమశివుడు నారదునికి బోధించాడు |
| 12. వరాహ పురాణాన్ని | మనుకల్పంలో | విష్ణువు పృథ్వికి బోధించాడు |
| 13. స్కాంద పురాణాన్ని | తత్పురుషకల్పంలో | స్కందుడు భూమికి బోధించాడు |
| 14. వామన పురాణాన్ని | కూర్మ కల్పంలో | బ్రహ్మ పులస్త్య మహామునికి బోధించాడు |
| 15. కూర్మ పురాణాన్ని | లక్ష్మీ కల్పంలో | విష్ణువు పులస్త్య మహామునికి బోధించాడు |
| 16. మత్స్య పురాణాన్ని | సప్త కల్పంలో | విష్ణువు మనువుకు బోధించాడు |
| 17. గరుడ పురాణాన్ని | గరుడ కల్పంలో | విష్ణువు మనువుకు బోధించాడు |
| 18. బ్రహ్మాండ పురాణాన్ని | భవిష్య కల్పంలో | బ్రహ్మ మనువుకు బోధించాడు |

# పురాణాలు ఎందుకు చదవాలి?

**పురాణశ్రవణే శ్రద్ధా యస్య స్యాద్ర్బాతరస్వహమ్ ।**
**తస్య సాక్షాత్ప్రసన్నః స్యాత్ శివో విష్ణుశ్చ సానుగః ॥**

**యత్స్నాత్వా పుష్కరే తీర్థే యాగే సింథౌ చ సంగమే ।**
**తత్ఫలం ద్విగుణం తస్య శ్రద్ధయా వై శృణోతి యః ॥**

**యే పఠంతి పురాణాని శృణ్వన్తి చ సమాహితాః ।**
**ప్రత్యక్షరం లభంత్యేతే కపిలాదానజం ఫలమ్ ॥**

**అపుత్రో లభతే పుత్రం ధనార్థీ లభతే ధనమ్ ।**
**విద్యార్థీ లభతే విద్యాం మోక్షార్థీ మోక్షమాప్నుయాత్ ॥**

**యే శృణ్వన్తి పురాణాని కోటిజన్మార్జితం ఖలు ।**
**పాపజాలంతు తే హిత్వా గచ్ఛన్తి హరిమందిరమ్ ॥**


పురాణాలు వినడంలో ఎవరికైతే శ్రద్ధ ఉంటుందో మరియు నిత్యము ఎవరైతే శ్రవణం చేస్తారో, అటువంటి వారి విషయంలో శివ-కేశవులు మరియు వారి గణాలు సంపూర్ణానుగ్రహం ప్రదర్శిస్తారు. పుష్కర తీర్థాల్లో, ప్రయాగ మొదలైన నదీసంగమ క్షేత్రాల్లో స్నానాలాచరిస్తే ఏవిధమైన పుణ్యం పొందగలరో దాని రెట్టింపు పుణ్యం పురాణ శ్రోతలకు లభిస్తుంది. భక్తి శ్రద్ధలతో పురాణ పఠన-శ్రవణాలు చేసేవారు కపిలగోవును దానం చేస్తే కలిగే పుణ్యరాశిని పొందగలరు. పుత్రులు లేనివారు పుత్రులను, దరిద్రులు ధనాన్ని, విద్యార్థులు విద్యను, మోక్షగాములు మోక్షాన్ని పొందగలరు. పురాణ శ్రోతలు తమ కోటి జన్మల పాపాలను దూరం చేసికొని చివర్లో శ్రీమన్నారాయణమూర్తి సాయుజ్యం పొందగలరు.

# పురాణ వైభవం

**అష్టాదశ పురాణానాం నామధేయాని యః పఠేత్ ।**
**త్రి సంధ్యాం జపతే నిత్యం సోఽశ్వమేధ ఫలం లభేత్ ॥**

ఈ అష్టాదశ మహాపురాణాల పేర్లను ఉదయ-మధ్యాహ్న-సాయంకాల సమయాల్లో ఎవరైతే పఠిస్తారో వారు అశ్వమేధ ఫలాన్ని పొందగలరని భావం.

# శ్రీ పద్మ పురాణం



శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే ॥

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అష్టాదశ పురాణాలలో రెండవది పద్మపురాణం. "హృదయం పద్మ సంజ్ఞతమ్" అన్న మాట ప్రకారం శ్రీమహావిష్ణువు హృదయంతో ఈ పురాణం పోల్చబడింది. పురాణ పురుషుడైన శ్రీమహావిష్ణువు నాభికమలం నుంచి మొదలైన సృష్టిని ఆధారంగా చేసుకుని చెప్పబడ్డ పురాణం కాబట్టి దీనికి పద్మపురాణం అనే పేరు వచ్చింది. "పాద్మం పంచపంచాశత్సహస్రాణీహ పర్యతే" అన్న వచనం ప్రకారం ఈ పురాణంలో మొత్తం 55 వేల శ్లోకాలున్నాయి.

యథా పంచేంద్రియస్సర్వ ః శరీరీతి నిగద్యతే ।
తథేదం పంచభిః ఖండైరుదితం పాపనాశనమ్ ॥

మానవులకి కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం అనే అయిదు ఇంద్రియాలు ఎలా ఉన్నాయో అదేవిధంగా ఈ పురాణంలో కూడా 5 ఖండాలున్నాయి. అవి 1.సృష్టి ఖండం 2.భూమిఖండం 3.స్వర్గ ఖండం 4.పాతాళ ఖండం 5.ఉత్తర ఖండం అని.

## పద్మపురాణంలో చెప్పిన ప్రధాన విషయాలు

**1.సృష్టి ఖండం :** ఈ ఖండంలో మొత్తం 82 అధ్యాయాలున్నాయి. వీటిలో – పుష్కర మాహాత్మ్యం, వేదపాఠలక్షణం, దానప్రశంశ, వ్రత ప్రశంశ, పార్వతీకల్యాణం, తారకోపాఖ్యానం, గయాదిమాహాత్మ్యం, కాలకేయాది అసురులవధ, గ్రహాల అర్చనావిధానం, అర్జునకర్ణుల ఉత్పత్తి, సోమవంశ వర్ణనం,

క్రోష్టువంశ వర్ణనం, పృథుమహారాజు వృత్తాంతం బ్రహ్మచేసిన యజ్ఞం, వైష్ణవధర్మం, భీమద్వాదశీ వ్రతవిధి, ఆదిత్యశయన వ్రతవిధి, వృక్షాలునాటే విధి, వామనావతార చరిత్ర, నాగతీర్థవర్ణనం, ప్రేత పంచక కథ, మార్కండేయుడి చరిత్ర, అన్నదాన మహిమ, పద్మంనుంచి బ్రహ్మపుట్టటం, తారకాసుర యుద్ధం లాంటి ప్రధాన విషయాలు సవివరంగా చెప్పబడ్డాయి.

**2. భూమి ఖండం :** ఈ ఖండంలో మొత్తం 125 అధ్యాయాలున్నాయి. వీటిలో ప్రధానంగా శివశర్మ కథ, సువ్రతోపాఖ్యానం, పాపపుణ్యవివక్ష, బలదైత్యవధ, వృత్రాసురవధ, పృథుచరిత్ర, వేనుడిచరిత్ర, సునీధీ చరిత్ర, వేనోపాఖ్యానం, అంగవశీకరణం, సుకళా చరిత్ర, సుదేవీ చరిత్ర, వీరధర్మ వర్ణనం, పద్మావతీ చరితం శుక్రదమన వివాదం, కృకల ధర్మ సంవాదం, పితృతీర్థవర్ణనం, మాతృ పితృతీర్థ మాహాత్మ్యం నహుష యయాతి చరిత్ర, శరీరదోష వర్ణనం, సుకృత, దుష్కృత కర్మవిపాకం, శివధర్మకథనం, యమలోక పీడా వర్ణనం, యయాతి యవ్వనం, శర్మిష్ఠాదేవయానుల వృత్తాంతం, గురుతీర్థనిరూపణం, రాజజైమిని సంవాదం, హుండదైత్యుడి వధ, అశోక సుందరి కథ, కామోదాఖ్యానం, విహుండవధ, చ్యవన కుంజల సంవాదం, సిద్ధాఖ్యానం లాంటి ప్రధాన విషయాలు ఈ ఖండంలో వివరంగా వర్ణించబడ్డాయి.

**3. స్వర్గ ఖండం :** ఈ ఖండంలో మొత్తం 39 అధ్యాయాలున్నాయి. వీటిలో –బ్రహ్మాండోత్పత్తి వర్ణనం, భూమిలోక సంస్థానం, తీర్థాఖ్యానం, నర్మదావృత్తాంతం, కురుక్షేత్రంలో ఉండే ప్రసిద్ధతీర్థాలు, కాళిందీ పుణ్యకథ, కాశీమాహాత్మ్యం, గయామాహాత్మ్యం, ప్రయాగ మాహాత్మ్యం, కర్మయోగ నిరూపణం, వ్యాస జైమిని సంవాదం, సముద్ర మథనం, వ్రతాఖ్యానం, ఊర్జపంచాహమహాత్మ్యం, సర్వాపరాధాలనీ తొలగించే దివ్యస్తోత్రం లాంటి ప్రధాన విషయాలు ఈ స్వర్గ ఖండంలో చెప్పబడ్డాయి.

**4. పాతాళఖండం :** ఈ ఖండంలో మొత్తం 113 అధ్యాయాలున్నాయి. వీటిలో –రామరాజ్యాభిషేచనం, రాముడు చేసిన అశ్వమేధయాగం, పౌలస్త్యవంశ చరిత్ర,

హయచర్య, పవిత్రమైన వివిధ రాజుల కథలు. జగన్నాథుడి వర్ణన, సకలపాపాల్నీ పోగొట్టే బృందావన మాహాత్మ్యం, కృష్ణావతారాన్ని ధరించిన శ్రీహరి లీలలు, మాధవస్నాన మాహాత్మ్యం వివిధ రకాల దానాలు వాటి ఫలితాలు, భూవరాహ సంవాదం, యమ-బ్రాహ్మణుల కథ, రాజదూత కథ, శ్రీకృష్ణ స్తోత్రాలు, శివ-శంభు సమాయోగం, దధీచోపాఖ్యానం, భస్మ మాహాత్మ్యం, శివమాహాత్మ్యం, దేవరాతసుతుడి ఉపాఖ్యానం, పురాణజ్ఞుడి ప్రశంశ, గౌతమాఖ్యానం, శివగీతా, రామకథ, భరద్వాజుడి ఆశ్రమం లాంటి ప్రధాన విషయాలన్నీ ఈ పాతాళ ఖండంలో చెప్పబడ్డాయి.

**5. ఉత్తర ఖండం :** ఇందులో మొత్తం 282 అధ్యాయాలున్నాయి. వీటిలో ప్రధానంగా శివుడు పార్వతీదేవికి చెప్పిన 'పర్వతాఖ్యానం', జలంధర కథ, గంగా, ప్రయాగ కాశీ, గయాతీర్థక్షేత్రాల పుణ్యకథలు, అన్నదాన మహిమ, మహాద్వాదశీవ్రతం,ఇరవైనాలుగు ఏకాదశుల మాహాత్మ్యం, విష్ణు ధర్మ సమాఖ్యానం, విష్ణు సహస్రనామం, కార్తీక వ్రతమాహాత్మ్యం, మాఘస్నాన ఫలం, జంబూతీర్థమహిమ, నృసింహోత్పత్తి, దేవశర్మాఖ్యానం, గీతా మాహాత్మ్యం, భక్తి మహిమ, శ్రీమద్భాగవత మహిమ, ఇంద్ర ప్రస్థమాహాత్మ్యం, మంత్ర రత్నాభిధానం, మత్స్యాది అవతారాలు, రామనామశతకం, రామనామ మహిమ లాంటి ప్రధాన విషయాలు ఈ అయిదో ఖండంలో సవివరంగా చెప్పబడ్డాయి.

## పద్మపురాణ ప్రాశస్త్యం

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్ ।
బహుశాస్త్రం సమభ్యస్య బహువేదాన్ సవిస్తరాన్ ॥

అన్ని శాస్త్రాలకన్నా బ్రహ్మదేవుడు మొట్ట మొదట పురాణశాస్త్రాన్నే స్మరించాడు. ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని వేదాలు పారాయణ చేసినా పురాణ శ్రవణం చేయని వారికి పరమాత్మ సాక్షాత్కారం లభించదు.

ఏవంయన్మహిమాలోకేలోక విస్తారకారణమ్ ।
తస్య విష్ణోః పరేశస్య నానావిగ్రహధారిణః ।

ఏవం పురాణ రూపంవై తత్రపాద్మం పరంమహత్ ॥

సకలలోకాల్ని తరింపచేసే మాహాత్మ్యం కలిగినవాడు, నానావిధ అవతారాల్ని ధరించేవాడు అయిన శ్రీమన్నారాయణుడు పురాణ పురుషుడు. ఆయన శరీరంలో వివిధ అవయవాలే అష్టాదశపురాణాలు. వాటిలో సర్వోత్తమమైనది పద్మపురాణం.

ఏతదేవ మహాపద్మమద్భుతం యన్మయం జగత్ ।
తద్వృత్తాంతాశ్రయం తస్మాత్పాద్మమిత్యుచ్యతే బుధైః ॥
పాద్మమేతత్పురాణాంతు స్వయం దేవోఽభవద్ధరిః ॥

ఈ పద్మం మహాద్భుతమైనది. ఈ చరాచర ప్రపంచమంతా పద్మస్వరూపమే. అలాంటి పద్మ (జగత్తు) వృత్తాంతాన్ని వివరించేది కాబట్టి దీన్ని పద్మపురాణం అన్నారు. ఈ పద్మ పురాణాన్ని శ్రీహరి హృదయంగా చెప్పినప్పటికీ తిరిగి ఈ పురాణం సాక్షాత్తు శ్రీహరి సంపూర్ణ స్వరూపంగా వర్ణించబడింది.

## క్షీరసాగర మథనం

ఒకనాడు అత్రి కుమారుడైన దుర్వాసమహర్షి భూమండలమంతా సంచరిస్తున్న సమయంలో ఆయనకి ఒక విద్యాధర స్త్రీ కనిపించింది. ఆమె చేతిలో సువాసనలు వెదజల్లుతున్న అందమైన పూలమాల ఉంది. దాన్ని చూసి ముచ్చటపడ్డ దుర్వాసుడు తనకిమ్మని అడిగాడు. ఎంతో సంతోషంగా ఆ విద్యాధరి తన చేతిలోని మాలని ఆయనకిచ్చింది. ఆ మాలను గ్రహించిన దుర్వాసుడు ఎంతో ఆనందించి అక్కడ నుంచి బయలుదేరి దివ్యమైన ప్రదేశాలు చూస్తూ తన సంచారాన్ని కొనసాగించాడు.

అన్నిలోకాలూ తిరుగుతూ దుర్వాసుడు ఒకనాడు స్వర్గానికి వచ్చాడు. దారిలో ఆయనకి ఐరావతం మీద ఊరేగుతూ వస్తున్న దేవేంద్రుడు కనిపించాడు. దుర్వాసుడు వెంటనే తన తలమీద ధరించిన పూలమాలని ఐరావతం మీద కూర్చున్న ఇంద్రుడి మీదకి విసిరేసాడు. ఇంద్రుడు దాన్ని అందుకుని

అంతేవేగంతో తన ఐరావతం మీదకి తిరిగి విసిరాడు. ఆ మాల ఐరావతం కుంభస్థలాన్ని అలంకరించి కైలాసం మీద ఉన్న గంగ లాగా శోభించింది.

తన తలమీద పడ్డ పూలమాల సువాసన ఏనుగు నాసాగ్రాలకి సోకింది. ఆ పూలవాసనకి మత్తెక్కిన ఐరావతం తన తొండంతో దాన్ని తీసి నేలకేసి కొట్టింది. అది చూసిన దుర్వాసుడికి ఆగ్రహం కలిగింది. తానెంతో గౌరవంతో సమర్పించిన పూలహారాన్ని దేవేంద్రుడు ఏనుగుమీదకి నిర్లక్ష్యంగా విసిరేస్తాడా। వాడికి ఎంత పొగరు? అని భావించాడు. వెంటనే "దేవేంద్రా! నీకు మదం ప్రకోపించింది. లక్ష్మీప్రదమైన నేనిచ్చిన పూలమాలని ధరించకుండా నిర్లక్ష్యంగా విడిచిపెట్టావు. కనీసం ఇచ్చిన నన్ను అభినందించలేక పోయావు. నీ పాపానికి గాను నీ త్రిభువన సామ్రాజ్య సంపద నశించుగాక! నీ పాలనలో ఉన్న ముల్లోకాలూ లక్ష్మీ హీనమైపోగాక! అని శపించాడు.

దుర్వాసుడి శాపం విన్నాక ఒక్కసారిగా ఇంద్రుడి కళ్ళు తెరుచుకున్నాయి. తను చేసిన అపరాధమేమిటో అతడికి తెలిసింది. వెంటనే ఏనుగుని దిగి దుర్వాసుడి కాళ్ళపై పడ్డాడు. ఎంతవేడుకున్నా పరమ కోపిష్ఠి అయిన దుర్వాసుడు ఇంద్రుణ్ణి కనికరించలేదు. అతడి ప్రార్థన ఏమాత్రం వినకుండా అక్కణ్ణుంచి వెళ్ళి పోయాడు. ఇక చేసేదేం లేక ఇంద్రుడు తన అమరావతికి తిరిగి బయలుదేరాడు.

దుర్వాసుడి శాపం ఫలించటం ప్రారంభమైంది. దేవేంద్రుడి పాలనలో ఉన్న అన్నిలోకాల్లో సంపదలు తరిగిపోసాగాయి. ఎక్కడ యజ్ఞయాగాలు కొనసాగటం లేదు. తపస్సులు చేయటం లేదు. దానధర్మాలు లేవు. ఇలా ప్రపంచమంతా తేజోహీనంగా మారిపోయింది. అన్ని రకాలుగా లోకాలన్నీ అంధకార బంధురంగా మారిపోయాయి. ఇదే తగిన సమయంగా భావించారు దానవులు. బలహీనులై, తేజోవిహీనులుగా మారిపోయిన దేవతలమీద దాడి చేసారు.వారి ధాటికి తట్టుకోలేక దేవతలందరూ తమ తమ లోకాల్ని విడిచి పారిపోయారు.

ఆ విధంగా దానవుల దాడి నుంచి తప్పించుకున్న దేవతలంతా ఒకే చోటికి చేరి, ఈ కష్టాల నుంచి గట్టె కెంచగలిగేవాడు శ్రీహరేనని తీర్మనించారు. వెంటనే అందరూ కలిసి సామూహికంగా శ్రీహరిని చేరి ఆయన్ని శరణువేడారు. దేవతల బాధలు విన్న శ్రీహరి వారిని ఓదార్చి "దేవతలారా! మీరేమీ చింతించకండి, ముందు మీరంతా వెళ్ళి దానవులతో సంధిచేసుకోండి. మీరు వారు కలిసి క్షీరసాగరాన్ని మథించండి. దానికోసం మంధర పర్వతాన్ని కవ్వంగా వాసుకి సర్పాన్ని త్రాడుగా చేసుకోండి. నేను మీకు సహాయంగా ఉంటాను. సముద్ర మథనం ద్వారా అమృతం ఆవిర్భవిస్తుంది. దాన్ని త్రాగటం వల్ల మీరు అమిత బలశాలురుగా మారి అమరులౌతారు ఇక వెళ్ళి వెంటనే పని ప్రారంభించండి" అని చెప్పి పంపాడు.

శ్రీహరి మాట ప్రకారం దేవతలు దానవులతో సంధికుదుర్చుకుని, మంధరపర్వతం వాసుకి సర్పం సాయంతో క్షీరసాగరాన్ని మథించటం ప్రారంభించారు. ఆ మథనంలో మొదటగా సురపూజిత అయిన కామధేనువు ఆవిర్భవించింది. దాన్ని చూసి దేవతలు దానవులు ఇద్దరూ ఎంతో ఆనందించారు. దాన్ని దేవతలు గ్రహించారు. తిరిగి మథనం ప్రారంభమైంది. కొద్ది సేపటికి ఆ సముద్రంలోనించి మత్తు గొలిపే చూపులతో, తూలుతున్న శరీరంతో వారుణీ శక్తి పుట్టింది. ఆమె ఆకారాన్ని చూసి దేవతలు తిరస్కరించగా దైత్యులు ఎంతో ఆనందంతో ఆ వారుణీ శక్తిని స్వీకరించారు.

తరువాత పారిజాత వృక్షం ఆవిర్భవించి దేవతల నందన వనంలో స్థిరంగా నిలిచింది. దాని తరువాత అరవై కోట్ల అప్సర గణాలు ఆవిర్భవించారు. పుణ్యజీవులైన వారంతా దేవదానవుల చేత గౌరవించబడ్డారు. వారి తరువాత చల్లని వెన్నెలలు కురిపిస్తూ చంద్రుడుదయించాడు. తన తలలో శిరోభూషణంగా అలంకరించుకుంటానని శంకరుడు చంద్రుణ్ణి గ్రహించాడు. ఆ వెంటనే భయంకరమైన జ్వాలలు వెదజల్లుతూ కాలకూట విషం ఆవిర్భవించింది. దాని చూసి దేవదానవులిద్దరూ భయపడిపోయారు. అందరి ప్రార్థన విన్న పరమేశ్వరుడు

ఆ విషాన్ని తన కంఠంలో ధరించాడు. అందువల్లనే ఆయన నీలకంఠుడయ్యాడు. ఆయన త్రాగగా మిగిలిన గరళాన్ని అక్కడే ఉన్న నాగులు త్రాగాయి.

## మహాలక్ష్మి ఆవిర్భావం

క్షీరసాగర మథనం కొనసాగుతోంది. కాలకూట విషం తరువాత కొద్దిసేపటికి అమృతభాండం ధరించిన ధన్వంతరి ఆ పాల సముద్రం నుంచి ఆవిర్భవించాడు. ఆ తరువాత వరుసగా ఉచ్చైశ్రవం(గుర్రం), ఐరావతం జన్మించాయి. వాటి వెంటే వికసించిన తామరపువ్వు మీద కూర్చుని సర్వాలంకార సంశోభిత అయిన మహాలక్ష్మి దేవి పాలసముద్రం నుంచి బైటికి వచ్చింది. సర్వమంగళకారిణి అయిన ఆ దేవిని చూసి ఋషులు, మునులు ఎంతో ఆనందించి శ్రీ సూక్తంతో ఘనంగా స్తుతించారు. ఆమె రాక సందర్భంగా విశ్వావసు గంధర్వులు పాటలు పాడగా, అప్సరగణాలు నాట్యాలు చేశారు. గంగాది నదులు దేవి స్నానం కోసం విచ్చేశాయి. దిగ్గజాలన్నీ స్వర్ణ కుంభాలతో గంగాజలాన్ని తీసుకుని మహాలక్ష్మి దేవిని అభిషేకించాయి. క్షీరసాగరుడు స్వయంగా పైకివచ్చి ఎప్పటికీ వాడిపోని పద్మాలమాలని దేవికి సమర్పించాడు.

దేవశిల్పి విశ్వకర్మ లక్ష్మీదేవికి దివ్యమైన స్వర్ణాభరణాల్ని తయారుచేసి ఇవ్వగా వాటిని ధరించి సర్వాలంకార సంశోభితగా మహాలక్ష్మీదేవి అందరికీ దర్శనమిచ్చింది. మహా సౌందర్యంతో కోటి సూర్యులకాంతితో వెలుగొందుతున్న ఆ దేవిని చూసి ఆమె లావణ్యానికి మైమరచిపోయి దేవతలు, దానవులు ఎవరికి వారు ఆమెని స్వీకరించాలని పోటీపడ్డారు. అదే సమయంలో బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి లక్ష్మీదేవిని శ్రీహరికి సమర్పించాడు. అందరూ చూస్తుండగా బ్రహ్మమాటని గౌరవించిన శ్రీహరి లక్ష్మీదేవిని తన వక్షఃస్థలం మీద ధరించాడు.

శ్రీహరిచేత వరించబడ్డ లక్ష్మీదేవి ఆయనతో “స్వామీ! నన్ను స్వీకరించినందుకు చాలా సంతోషం. నన్నెప్పుడూ మీరు విడవకండి. మీ హృదయమే నాకు తగిన స్థానం. మీ ఆజ్ఞల్ని నేను శిరసావహిస్తాను” అని సవినయంగా అని, తన చేతిలో ఉన్న పూలమాలని ఆయన మెళ్ళో వేసింది.

ఆ దివ్య దృశ్యాన్ని చూసి దేవతలంతా ఎంతో సంతోషించి వారి మీద పూలవాన కురిపించారు.

లక్ష్మీదేవి తమకి దక్కకుండా శ్రీహరిని వరించటంతో దానవులంతా ఎంతో బాధపడ్డారు. దేవతల మీద వారికి కోపం వచ్చింది. వారికి ధన్వంతరి అమృతభాండం పట్టుకుని కనిపించాడు. అంతే ఒక్కసారిగా ఆయన చేతిలో ఉన్న భాండాన్ని లాక్కుని పరుగెత్తారు. అది చూసి దేవతలంతా ఎంతో ఆందోళనపడ్డారు. శ్రీహరి వారిని ఊరడించి మోహినీ రూపాన్ని ధరించి వారి ముందుకెళ్ళాడు. తన మాయోపాయంతో వారందర్నీ పరవశుల్ని చేసి, మోహపరిచి అమృతాన్ని మొత్తం దేవతలకే దక్కేలా చేసాడు. దానవుల దగ్గరకొచ్చేసరికి ఒక్క చుక్క కూడా మిగల్లేదు. దాంతో ఆగ్రహించిన అసురులు ఆయుధాలు ధరించి దేవతలపై తిరగబడ్డారు. అయితే అప్పటికే అమృతం తాగిన కారణంగా దేవతలు అమితబలవంతులై అసురుల దాడిని తిప్పికొట్టారు. అంతేకాదు వారిని తమ స్థానాల నుంచి తరిమేశారు.

ఆ విధంగా దేవతలధాటికి తట్టుకోలేక అసురులంతా పారిపోగా దేవతలు సంతోషించి తమకింత మేలుచేసిన శ్రీహరిని పరిపరివిధాలుగా ప్రార్థించి, తమతమ లోకాలకి వెళ్ళిపోయారు. ఇక ఆనాటి నుంచి అసురులు సురాపానవ్యసనులై స్త్రీ లోలులై పాతాళానికి వెళ్ళి అక్కడే నివసించసాగారు.

ఎప్పుడైతే మహాలక్ష్మీదేవి ఆవిర్భవించిందో వెంటనే అన్ని లోకాలూ తిరిగి ప్రకాశించాయి. అందరికీ ధర్మబుద్ధి కలిగింది. సూర్యుడు పోయిన కాంతిని తిరిగి పొందాడు. అగ్ని తన పూర్వ తేజస్సుతో తిరిగి ప్రజ్వరిల్లాడు. ఆ విధంగా ముల్లోకాలూ లక్ష్మీకళతో వైభవంగా విరాజిల్లాయి. అప్పుడు బ్రహ్మదేవుడు దేవతలతో "సురులారా! జగన్నాథుడైన శ్రీహరి జగద్రక్షకుడైన శంకరుడు మీకెప్పుడూ అండగా వుంటారు. వారిని మీరెప్పుడూ ఉపాసిస్తూ వుండాలి. వారే మీకు వరప్రదాతలు" అని చెప్పి తన సత్యలోకానికి వెళ్ళిపోయాడు. ఆ విధంగా మహాలక్ష్మీదేవి క్షీరసాగరం నుంచి ప్రాదుర్భవించింది.

# దక్షుడు చేసిన సృష్టి

బ్రహ్మదేవుడు సృష్టిరచనలో భాగంగా మొదట దేవగణాల్ని సృష్టించాడు. అయితే ఆ గణాలు ఆయన అనుకున్నంతగా వృద్ధి చెందలేదు. అప్పుడు బ్రహ్మ మానసపుత్రుడైన దక్షప్రజాపతి తనకు పుట్టిన వేలమంది సంతానాన్ని పిలిచి వారందరితో "మీరంతా సంతానాన్ని మరింతగా వృద్ధి చేయండి" అని ఆదేశించాడు. దక్షుడి పుత్రుల్లో హర్యక్షులు సంతానాన్ని కనటానికి సిద్ధపడగా నారదుడు వచ్చి వారితో "మీరు భూమండలమంతా పర్యటించి ఆ తరువాత సృష్టిని పెంపొందించండి" అని హితబోధచేసాడు. దానితో వారు సంచారానికి వెళ్ళిపోయారు. ఎంతకాలమైనా తిరిగిరాలేదు. హర్యక్షులు ఆ విధంగా రాకపోయేసరికి దక్షప్రజాపతి వారిణి అనే తన భార్య ద్వారా వేయిమంది పుత్రుల్ని కన్నాడు.

శబలాశ్వులుగా ప్రసిద్ధిచెందిన ఆ దక్షపుత్రులు సంతానాన్ని పెంపొందించటానికి సిద్ధపడగా తిరిగి నారదమహర్షి వారి దగ్గరకొచ్చి హర్యశ్వులకి చెప్పినట్టే లోక సంచారం చేసి ఆ తరువాత సంతానాన్ని కనమన్నాడు. నారదుడి ఆదేశాన్ని మన్నించి వారు కూడా లోకసంచారానికి బయలుదేరారు. ఎంతకాలమైనా వారు కూడా తిరిగి వెనక్కి రాలేదు.

దక్షుడు తన పుత్రులు తిరిగి రానందుకు బాధపడి వారిణి అనే తన మరో భార్య ద్వారా 60 మంది స్త్రీ సంతానాన్ని కన్నాడు. వారిలో పదిమంది కుమార్తెల్ని ధర్ముడికి, పదమూడు మంది కుమార్తెల్ని కశ్యప ప్రజాపతికి, ఇరవైఏడుమంది కుమార్తెల్ని సోముడికి (చంద్రుడు), ముగ్గురు పుత్రికల్ని అరిష్టనేమికి, భృగుపుత్రుడికి ఇద్దర్ని, కృతాశ్వుడికి ఇద్దర్నీ, అంగిరసుడికి మిగిలిన ఇద్దరు కుమార్తెల్ని ఇచ్చి వివాహం జరిపించాడు.

1. అరుంధతి 2.వసువు 3.జావి 4.లంబ 5.భానువు 6.మరుత్వతి 7.సంకల్ప 8.మూహూర్త 9.సాధ్య 10.విశ్వ అనే ఈ పదిమంది దక్ష కుమార్తెలు ధర్ముణ్ణి వివాహం చేసుకున్నారు. వీరికి విశ్వేదేవుళ్ళు కుమారులుగా జన్మించారు.

సాధ్యకి జన్మించినవారు సాధ్యులు మరుత్వతి కుమారులు – మరుత్వంతులు, వసువు సంతానం వసువులు, భానువుకి జన్మించిన వారు భానువులు, ముహూర్తకి పుట్టిన పుత్రులు ముహూర్తులు, లంబకి జన్మించిన వారు ఘోషులు, జామికి పుట్టినవారు నాగవీథి, అరుంధతికి భూతలంలో ఉన్నవారు సంతానంగా కలిగారు. ఈ విధంగా వీరంతా జన్మించి నాలుగుదిక్కులా వ్యాపించారు.

**అష్టవసువులు :** దక్షుడికి కుమార్తెలకి జన్మించిన వారిలో అష్టవసువులు సుప్రసిద్ధులు. 1.ఆపుడు 2.ధ్రువుడు 3.సోముడు 4.ధరుడు 5.అనిలుడు 6.అనలుడు 7.ప్రత్యూషుడు 8.ప్రభాసుడు అనేవారు.

**ఏకాదశరుద్రులు :** బ్రహ్మ మానసపుత్రులుగా జన్మించిన వారిలో ప్రఖ్యాతి చెందిన వారు ఏకాదశ రుద్రులు. 1.అజైక పాత్తు 2.హర్భుధ్న్యుడు 3.విరూపాక్షుడు 4.రైవతుడు 5.హరుడు 6.బహుర్ధురూపుడు 7.త్ర్యంబకుడు 8. సురేశ్వరుడు 9.సావిత్రుడు (వైవశ్వతుడు) 10.జయంతుడు 11.పినాల వీరితోపాటు పన్నెండోవాడైన అపరాజితుడు కూడా ప్రసిద్ధిచెందాడు. వీరందర్నీ గణేశ్వరులంటారు. త్రిశూలధారులైన ఈ పన్నెండుమందికీ 84 కోట్లమంది పుత్రులు జన్మించారు. వారంతా నలుదిశలా వ్యాపించి సృష్టిని రక్షిస్తుంటారు.

## కశ్యప వంశం

కశ్యపప్రజాపతికి దితి, అదిత్తి, దనువు, అరిష్ట, సురన, సురభి, వినత, తామ్రా, క్రోధావశా, ఇరా, కద్రువ అనే వారు భార్యలు. వైవస్వత మన్వంతరంలో అదితి సంతానంగా జన్మించిన ఆదిత్యులు పన్నెండుమంది. ఆ పన్నెండు మందీ ఎవరంటే 1.ఇంద్రుడు 2.ధాత 3.భగుడు 4.త్వష్ట 5.మిత్రుడు 6.వరుణుడు 7.అర్యముడు 8.వివస్వంతుడు 9.సవిత 10.పూష 11.అంశుమంతుడు 12.విష్ణువు. వీరంతా వేయి కిరణాలతో వెలుగొందుతారు.

కశ్యప్రప్రజాపతికి 'దితి' అనేభార్య ద్వారా దైత్యులు జన్మించారు. వీరంతా ప్రతికల్పంలో పుడుతూ నశిస్తూ వుంటారు. కశ్యపుడికి దితి ద్వారా జన్మించిన దైత్యుల్లో ప్రముఖులు ఇద్దరు. 1.హిరణ్యాక్షుడు 2.హిరణ్యకశిపుడు.

వీరిలో హిరణ్యకశిపుడికి తిరిగి నలుగురు పుత్రులుదయించారు. వారు 1.ప్రహ్లాదుడు 2.అనుహ్లాదుడు 3.సంహ్లాదుడు 4.ఆహ్లాదుడు అనేవారు.

ప్రహ్లాదుడి సంతానం 1.ఆయుష్మంతుడు 2.శిబి 3.బాష్కలి 4.విరోచనుడు అనేవారు. వారిలో విరోచనుడు బలి చక్రవర్తిని కన్నాడు. ఆ బలిచక్రవర్తికి వందమంది పుత్రులు, వారందరిలోకీ పెద్దవాడు బాణుడు కాగా, మిగిలిన 99మందీ ధృతరాష్ట్రాదులు. బలికుమారుడైన బాణాసురుడు పరమశివభక్తుడు. వేయిచేతులు కలిగినవాడు సకల శాస్త్రాలు తెలిసిన పండితుడు. బాణుడు చేసిన కఠోరతపస్సుకి ఎంతో సంతోషించిన శంకరుడు ప్రత్యక్షమై ఎప్పుడు అతడికి అతడి నగరానికీ రక్షకుడుగా వుంటున్నాడు.

కశ్యపుడి కుమారుడైన హిరణ్యాక్షుడికి కంధకుడు, భూతసంతాపనుడు, మహానాగుడు అనే పుత్రలుదయించారు. వారందరూ మనుమలు, మునిమనుమలతో కలిసి 77 కోట్లమందిగా విస్తరించారు. వీరు మహాబలశాలురు. తేజో సంపన్నులు.

కశ్యపుడు 'దనువు' అనేభార్య ద్వారా వందమంది పుత్రుల్ని కన్నాడు. వారంతా బలసంపన్నులు. ఆ వందమందిలో 'విప్రచిత్త' అనేవాడు ప్రధానుడు. అతడి తరువాత పదహారు తలలున్న శకుని, అయోముఖుడు, సుపర్వుడు అనేవారు వీరులుగా ప్రసిద్ధి చెందారు.

దనువుకి పుట్టిన కుమారుల్లో స్వర్భానువుకి 'సుప్రభ' పులోముడికి 'శచీదేవి' యముడికి 'ఉపదానవి' కుహూవుకి 'మండోదరి' వృషపర్వుడికి శర్మిష్ఠ–చడ, వైశ్వానరుడికి ప్రలోమ–కాలిక అనేవారు కూతుర్లుగా జన్మించారు. వీరంతా మరీచుడికి భార్యలుగా వుండి ఎంతోమంది సంతానాన్ని కన్నారు. మహాబలాఢ్యులైన వారి సంతానం మొత్తం అరవైవేలమంది. వారంతా హిరణ్యపురంలో నివసిస్తూ తమ తపస్సుద్వారా బ్రహ్మని మెప్పించి ఎన్నో వరాలు పొందారు.

## వినత సంతానం

కశ్యపుడికి 'వినత' ద్వారా గరుత్మంతుడు, అరుణుడు అనే ఇద్దరు జన్మించారు. వీరిద్దరూ పక్షిరాజులే. అలాగే వినతకి కూతురుగా సౌదామిని (మెఱుపు) జన్మించింది. ఆమె చీకటిని చెండాడుతుంది. వీరిలో సంపాతి, జటాయువు అనే ఇద్దరూ అరుణుడి పుత్రులుగా జన్మించారు. సంపాతి కొడుకు భభ్రువుకాగా, జటాయువుకి కర్ణికారి, శతగామి అనే ఇద్దరు పుత్రులు ఉదయించారు. క్రమంగా వీరి వంశం పుత్రపౌత్రాభివృద్ధి చెందింది. వినత కుమారుడైన గరుత్మంతుడికి 'సురస' అనే భార్య ద్వారా వేయిమంది జన్మించారు.

## కద్రువ సంతానం

కశ్యపుడికి భార్యల్లో ప్రసిద్ధురాలు కద్రువ. ఆమె కశ్యప ప్రజాపతి ద్వారా వేయిమంది నాగుల్ని పుత్రులుగా కన్నది. వారిలో శేషుడు, వాసుకి, కర్కోటకుడు, శంఖుడు, ఐరావతుడు, కంబలుడు అనేవారు సుప్రసిద్ధులు, వీరందరికీ మనుమలు, మునిమనుమలు అసంఖ్యాకంగా ఉదయించారు. వారిలో ధనుంజయుడు, పతంజలి అనేవారు ప్రముఖులు. తదనంతర కాలంలో జనమేజయ మహారాజు చేసిన సర్పయాగంలో పడి లక్షలాది సర్పగణాలన్నీ నాశనమైపోయాయి.

## కశ్యపుడి ఇతర సంతానం

కాశ్యపుడి ద్వారా 'మహిషి' అనే భార్య కోరలుగల జంతువుల్ని, కాకుల్ని కన్నది. సురభి అనే భార్య గేదెల్లి ఆవుల్ని కన్నది. అలాగే 'ముని' భార్య ముని గణాలని, అప్సర గణాల్ని, కిన్నర గంధర్వాదుల్ని ఎంతో మందిని కన్నది. 'ఇర' అనే భార్య గడ్డి చెట్లని తీగల్ని, పొదల్ని కన్నది. 'ఖస' అనే మరోభార్య కోట్లాదిమంది యక్షుల్ని రాక్షసుల్ని కనగా, వారంతా అసంఖ్యాకంగా సృష్టిని వృద్ధిచేశారు. ఇలా కశ్యపుడి దాయాదులు వందలు వేల సంఖ్యలో భూమండలమంతా వ్యాపించారు. ఇది స్వారోచిష మన్వంతరంలో జరిగిన సృష్టి. వీరి తరువాత కశ్యప ప్రజాపతి 'దితి' ద్వారా 49 మంది మరుద్గణాలని కన్నాడు. వారంతా వీరులుగా దేవప్రభువులుగా కీర్తిగాంచారు.

# జ్యేష్ఠపూర్ణిమా వ్రతం

మహాప్రభావవంతమైన ఈ జ్యేష్ఠ పూర్ణిమావ్రతాన్ని పూర్వం కశ్యపుడి భార్య అయిన 'దితి' ఆచరించి 49 మంది మరుత్తుల్ని కన్నది.

**వ్రతవిధానం :** జ్యేష్ఠపూర్ణిమనాడు ఉదయాన్నే స్నాన సంధ్యలు ముగించుకుని పూజామందిరంలో కలశస్థాపన చేయాలి. ఆ కలశంలో తెల్లటి బియ్యం, వడ్లు నింపి దానిలో ఒక చెఱకుగడని ఉంచాలి. దానికి మంచి గంధాన్ని పూసి తెల్లటి వస్త్రాన్ని కప్పాలి. ఆ కలశం చుట్టూ భక్ష్యాల్ని, యథాశక్తి బంగారాన్ని ఉంచి బెల్లం కూడా వేసి, దానిమీద రాగి బిందెని బోర్లించాలి. దానిమీద బంగారు తామరపూవు దుద్దుమీద బ్రహ్మని, సావిత్రిని చక్కెరతో బొమ్మలుగా చేసి ప్రతిష్ఠించాలి. ఆ ప్రతిమలకి నైవేద్యాన్ని సమర్పించాలి. ఒకవేళ శక్తిలేక ఇంత తతంగాన్ని చేయలేనివారు బెల్లంతో బ్రహ్మ పేరుతో ఒక ప్రతిమని తయారుచేసి దాన్ని తెల్లటి పూలతో అక్షతలతో, నువ్వులతో ఇలా అర్చించాలి.

**అంగపూజ :** ఓం బ్రహ్మణే నమః – పాదౌ పూజయామి, ఓం సౌభాగ్యదాయై నమః–జంఘే పూజయామి, ఓం విరించయే నమః – ఊరూం పూజయామి. ఓం మన్మథాయనమః–కటిం పూజయామి, ఓం స్వచ్ఛోదరాయ నమః ఉదరం పూజయామి. ఓం అతుద్రాయనమః – వక్షః స్థలం పూజయామి. ఓం పద్మముఖాయ నమః–ముఖం పూజయామి ఓం వేదపాణయే నమః – బాహూం పూజయామి. ఓం సర్వాత్మనే నమః శిరః పూజయామి. అని బ్రహ్మ ప్రతిమని భక్తి శ్రద్ధలతో పూజించి, ఆ తరువాత పద్మాన్ని కూడా పూజించాలి.

ఈ విధంగా బ్రహ్మ ప్రతిమకి, కుంభానికి, పద్మానికి పూజ చేసిన తరువాత మర్నాడు సూర్యోదయాన యోగ్యుడైన బ్రాహ్మణుడికి ఆ కుంభాన్ని దానం చేయాలి. అలాగే ఆ విప్రుడికి భోజన దక్షిణ తాంబూలాన్ని సమర్పించి, తరువాత తాను ఉప్పు లేకుండా ఆహారాన్ని భుజించాలి.

బ్రహ్మదేవుడు సర్వలోక పితామహుడు.

కనుక ఆయన్ని

ప్రీయతామత్ర భగవాన్ సర్వలోక పితామహః ।
హృదయేసర్వలోకానాం యస్త్వా నిందోఽభిధీయతే ॥

*(శ్లో॥20,అధ్యా-7)*

"సర్వలోక పితామహుడవైన ఓ బ్రహ్మదేవా! సర్వలోకాలలో అంతరంగ మూర్తివై వున్న పితామహా! నేను చేసిన వ్రతం వల్ల నీవు సంప్రీతిని పొందుగాక" అని చెప్పి ఈ వ్రతాన్ని బ్రహ్మదేవుడికి సమర్పించాలి. ఆ రోజు రాత్రి కేవలం పళ్ళు తిని నేలమీద నిద్రపోవాలి.

**ఉద్యాపన :** ఈ విధంగా పన్నెండు నెలలపాటు ప్రతిజ్యేష్ఠ పూర్ణిమకీ ఈ వ్రతాన్ని చేయాలి. ఒకవేళ అలా పన్నెండు నెలలూ చేయలేకపోతే తిరిగి పదమూడో నెల రాగానే ఘృత-ధేనువు, మంచిపరుపు, తలగడ, మంచం ఇవన్నీ దక్షిణ తాంబూలాలతో సహా యోగ్యుడైన విప్రుడికి దానం చేయాలి. శక్తి ఉన్నవారు బ్రహ్మ ప్రతిమని బంగారంతో, సావిత్రి ప్రతిమని వెండితో తయారు చేయించి యోగ్యులైన విప్రదంపతుల్ని పిలిచి వారిని చక్కగా పూజించి, బ్రహ్మ సావిత్రులుగా వారిని భావించి ఈ రెండు ప్రతిమల్నీ వారికి దానం చేయాలి.

ఈ విధంగా దానాలు చేసిన తరువాత ఆ విప్రదంపతుల ఆశ్వీరచనాల్ని స్వీకరించి, బ్రహ్మ నామాలు చెబుతూ నువ్వులతో యథాశక్తి హోమం చేయాలి. హోమానంతరం ఆవునెయ్యితో పాయసం తయారుచేయించి విప్రులకి అన్నసంతర్పణ చేసి యథాశక్తి పూలమాలలతో సహా దక్షిణ లివ్వాలి.

**వ్రతఫలం :** పురుషులు గానీ, స్త్రీలు గానీ ఈ వ్రతాన్ని చేసినట్లైతే సకల పాపాలనుంచీ విముక్తులవుతారు.

ఇహలోకే వరాన్ పుత్రాన్సేభాగ్యం ధ్రువమశ్నుతే ।
యో బ్రహ్మే నస్మృతో విష్ణురానందాత్మా మహేశ్వరః ॥

*(శ్లో॥28,అధ్యా-7)*

బ్రహ్మ దేవుడి ప్రీతిగా ఈ జ్యేష్ఠ పూర్ణిమా వ్రతాన్ని శ్రద్ధా, భక్తులతో ఆచరించినవాడు ఇహలోకంలో పుత్ర సౌభాగ్యాన్ని పొందుతాడు. బ్రహ్మ అంటే

ఆనందస్వరూపుడైన పరమాత్మ. ఆయనే మహావిష్ణువూ మహేశ్వరుడూ కూడా. కనుక సుఖం కావలసిన వారు బ్రహ్మని స్మరించాలి.

పరమ పవిత్రం, పుత్ర సంతాన కారకం అయిన ఈ వ్రతాన్ని 'దితి' అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించింది. దానివల్ల ఇంద్రుణ్ణి చంపగలిగిన కుమారుణ్ణి సంతానంగా పొందింది.

## గర్భిణీస్త్రీలు పాటించాల్సిన నియమాలు

పూర్వం కశ్యపప్రజాపతి తన భార్య 'దితి' గర్భాన్ని ధరించగా ఆమెకి గర్భిణీస్త్రీ ఏవిధమైన నియమాలు పాటించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అన్న విషయాల్ని ఈ విధంగా తెలియచేసాడు. ఇవి ఆనాడే కాదు ఈనాడు కూడా అందరూ ఆచరించతగ్గ నియమాలి.

★ సంధ్యా సమయంలో భోజనం చేయకూడదు.

★ చెట్ల మొదల్లో నిలబడకూడదు.

★ అతిగా నిద్రపోకూడదు, నీళ్ళలో దిగరాదు.

★ రోలు రోకలి వీటిజోలికి వెళ్ళకూడదు.

★ శూన్యంగా ఉన్న ఇంటిలోకి వెళ్ళకూడదు.

★ పుట్టలున్న చోట నిలబడకూడదు.

★ మనసుని ఆందోళనకి గురికాకుండా చూసుకోవాలి.

★ నేలమీద బొగ్గులతో, బూడిదలో గోళ్ళతో రాయకూడదు.

★ ఎప్పుడూ పడుకునే ఉండకూడదు.

★ వ్యాయామం, అధిక శారీరక శ్రమ చేయకూడదు.

★ ఊక, బొగ్గులు, బూడిద, ఎముకలు పుర్రెలున్న చోట కూర్చోకూడదు.

★ ఇతరులతో కలహమాడకూడదు. తలంటుకోకూడుదు.

★ తలవిరబోసుకుని తిరగకూడదు.

★ అపరిశుభ్రంగా ఉండరాదు. ఉత్తరం వైపు తల పెట్టకూడదు.

★ తలకిందకి వాల్చి పడుకోకూడదు

★ బట్టవిప్పుకొని, తడికాళ్ళతో ఉండరాదు

★ అమంగళకరమైన మాటలు అనకూడదు

★ ఎక్కువగా పరిహాసాలాడకూడదు

★ మాంగల్యాభివృద్ధి కోరి అగరుధూపాలతో దైవపూజ చేయాలి

★ అన్నిరకాల మూలికలు వేసి స్నానం చేయాలి

★ భర్త క్షేమాన్నే నిత్యం కోరుతూ చిరునవ్వుతో ఉండాలి.

★ ఎలాంటి స్థితిలోనూ భర్తని అసహ్యించుకోకూడదు

★ అయ్యో నేను చిక్కిపోయాను, బలహీనమైపోయాను, నాకు వార్ధక్యం వచ్చింది, నా కుచాలు చిన్నవైపోయాయి, నా ముఖం ముడతలు పడింది అని భావించి ఆందోళన చెందకూడదు.

ఈ విధంగా గర్భిణీస్త్రీలు నియమాల్ని శ్రద్ధగా పాటించినట్లైతే సకల శుభలక్షణాలు కలిగిన సంతానాన్ని అనాయాసంగా పొందుతారు.

## మన్వంతరాలు

**1. స్వాయంభువ మన్వంతరం :** స్వాయంభువ మన్వంతరంలో దేవతల్ని యాములు అంటారు. ఈ స్వాయంభువ మనువుకి అగ్నీధ్రుడు, అగ్నిబాహువు, విభువు, సవనుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, భవ్యుడు, మేథ, వసువు, మేథాతిథి అనే పదిమందీ పుత్రులు. వీరంతా ప్రతిమన్వంతరంలో జన్మిస్తూ ఉంటారు.

**2. స్వారోచిష మన్వంతరం :** స్వారోచిష మనువుకి 1.నభుడు 2.నభస్సుడు 3. ప్రభృతి 4.భావనుడు అనే నలుగురు పుత్రులున్నారు. ఆయన పరిపాలనా కాలంలో 1.కీర్తివర్ధనుడు 2.దత్తుడు 3.అగ్నిచ్యవనుడు 4.స్తంభుడు 5.ప్రాణుడు 6.కశ్యపుడు 7.బృహస్పతి అనేవారు సప్తర్షులుగా ఉన్నారు. ఆ కాలంలో ఉన్న దేవతల్ని 'తుషితులు' అని పిలిచేవారు.

**3. ఔత్తమ మన్వంతరం :** ఈ మన్వంతరంలో ఉండే దేవతల్ని 'ఊర్జులు' అంటారు. ఔత్తమనువుకి ఇషువు, ఊర్జస్సు, శుచి, శుక్రుడు, మధుడు, మాధవుడు, నభుస్యుడు, నభస్సు, నహుడు, సహస్యుడు అనే పదిమందీ పుత్రులుగా ఉన్నారు. ఈ మన్వంతరంలో సప్తర్షులుగా ఉన్నవారు – 1.భిండి 2.కుతండుడు 3.దౌల్భ్యుడు 4.శంఖుడు 5.ప్రజాపతి 6.మితి 7.సంమితి అనే ఏడుగురు.

**4. తామస మన్వంతరం :** ఈ మన్వంతరంలో ఉండే దేవతలు సాధ్యులు అని వ్యవహరించబడ్డారు. తామసమనువుకి అకల్మషతపుడు, ధన్వి, తపోమూలుడు, తపోరాశి, తపస్యుడు, సుతపస్యుడు, పరంతపుడు అనేవారు పుత్రులుగా జన్మించారు. ఈ మన్వంతరానికి 1.కపి 2.పృస్థువు 3.అగ్ని 4.రకపి 5.కవి 6.ఈషుడు 7.జన్యధాముడు అనే ఏడుగురూ సప్తర్షులుగా ఉన్నారు.

**5. రైవత మన్వంతరం :** ఈ మన్వంతరంలో ఉండే దేవతలు పదిమంది. వారిని భూతరజస్సు అనగా ప్రకృతులు అని వ్యవహరిస్తారు. వారి పేర్లు అవిశుడు, తత్త్వదర్శి, నీతిమంతుడు, హవ్యవుడు, కపిముక్తుడు, నిరుత్సకుడు, సత్వుడు, నిర్మోహుడు, ప్రకాశకుడు, ధర్మవీర్యుడు, బలోపేతుడు. ఈ మన్వంతరానికి – 1 దేవబాహువు 2.సుబాహువు 3.పర్జన్యుడు 4.సమయుడు 5.ముని 6.హిరణ్యరోముడు 7.సప్తాశ్వుడు అనే ఏడుగురూ సప్తర్షులుగా ఉంటారు.

**6. చాక్షుష మన్వంతరం :** చాక్షుషమన్వంతరంలో దేవతలు పంచమజనులుగా పిలువబడతారు. రురువు ప్రభృతులు చాక్షుషమనువుకి పుత్రులుగా జన్మించగా, ఈ మన్వంతరానికి 1.భృగువు 2.సుదాముడు 3.సహిష్ణువు 4.నారదుడు 5.వివస్వంతుడు 6.విరజుడు 7.కృతి అనేవారు సప్తర్షులుగా ఉన్నారు.

**7. వైవస్వత మన్వంతరం :** ఈ మన్వంతరానికి సప్తర్షులుగా 1.అత్రి 2.వశిష్ఠుడు 3.కశ్యపుడు 4.గౌతముడు 5.భారద్వాజుడు 6.విశ్వామిత్రుడు 7.జమదగ్ని వున్నారు. ఈ మన్వంతరంలో వీరు ధర్మ వ్యవస్థని కాపాడుతుంటారు.

**8. సావర్ణి మన్వంతరం :** ఇది రాబోయే మన్వంతరం. ఇందులో 1.అశ్వత్థామ 2.శరద్వంతుడు 3.కౌశికుడు 4.గాలిపుడు 5.శతానందుడు 6.కాశ్యపుడు 7.పరుశురాముడు సప్తర్షులుగా ఉంటారు.

**9. అర్కసావర్ణి మన్వంతరం :** 1.ధృతి 2.వరీయుడు 3.యవసువు 4.సుపర్ణుడు 5.ధృతి 6.వరిష్ణ 7.వీర్యుడు 8.సుమతి 9.వసువు 10.శుక్రుడు అనేవారు అర్కసావర్ణికి పుత్రులుగా జన్మిస్తారు.

ఈ విధంగా తొమ్మిదిమంది మనువులు మన్వంతరాలతో పాటు రౌచ్యమన్వంతరం, భేతిమన్వంతరం, బ్రహ్మసావర్ణి మన్వంతరం, యేరు సావర్ణి మన్వంతరం లాంటివి కూడా ఏర్పడతాయి. ఆయా మన్వంతరాలన్నీ ఒక్కొక్కటీ వేయియుగాల పాటు ఉండి ఆ తరువాత అన్నీ నశిస్తాయి. తిరిగి నూతనంగా మన్వంతరాలు ఏర్పడతాయి.

## పృథు మహారాజు కథ

పూర్వం కృతయుగం చివర్లో 'అంగుడు' అనే ప్రజాపతి ఉండేవాడు. ఆ ప్రజాపతి మృత్యువు కుమార్తెని వివాహం చేసుకున్నాడు. ఆమె అంద విహీనురాలు. కొంతకాలానికి అంగుడి ద్వారా ఆమెకి 'వేనుడు' అనే కుమారుడు జన్మించాడు. వేనుడు అధర్మపరుడు.పరమకాముకుడు. అధర్మాన్ని పెంచి పెద్దచేసాడు. దేవతల మీదకి దండెత్తి వారి భార్యల్ని అపహరించాడు. అలా ఎన్నోరకాలుగా దౌర్జన్యాలు చేస్తూ పరమక్రూరమైన వాడుగా పేరుపొందాడు. వేనుడి అకృత్యాల్ని సహించలేని ఋషులందరూ ఒకనాడు సమావేశమై అతన్ని చంపాలని నిశ్చయించుకుని అందరూ కలిసి అతన్ని శపించారు. వారి శాప ప్రభావంతో వేనుడు మరణించాడు.

రాజులేని రాజ్యం అల్లకల్లోలమవుతుందని భావించిన ఋషులందరూ మరణించిన వేనుడి కళేబరాన్ని మధించటం ప్రారంభించారు. అప్పుడు ఆ వేనుడి శరీరం నుంచి మ్లేచ్ఛజాతులు పుట్టారు. కొద్దిసేపటి తరువాత తిరిగి అతడి శరీరం నుంచి తల్లి అంశతో కాటుకలా నల్లగా ఉండేవారు జన్మించారు. అలాగే తన తండ్రి అంశతో వేనుడి కుడిభుజం నుంచి ధనుర్బాణాలతో, గదతో, రత్నకవచంతో ప్రకాశిస్తున్న ఒక శిశువు ఉదయించాడు. అతడే ధర్మమూర్తి అయిన పృథుచక్రవర్తి. ఆయిన సాక్షాత్తు విష్ణువే.

వేనుడి శరీరం నుంచి జన్మించిన ఆ పృథుచక్రవర్తి విప్రులచేత పట్టాభిషిక్తుడై కఠోరమైన తపస్సుచేసి శ్రీహరి అనుగ్రహంతో సకల భూమండలానికీ ప్రభువయ్యాడు. ఒకనాడు పృథుచక్రవర్తి వేదాలు పఠించక, యజ్ఞయాగాదులు చేయక, ధర్మశూన్యంగా ఉన్న భూమిని చూసి కోపంగా తన బాణంతో దాన్ని వధించబోయాడు. అది గ్రహించిన భూదేవి వెంటనే ఒక ఆవు రూపాన్ని ధరించి పరుగెత్తింది. పృథుచక్రవర్తి దాన్ని వెంబడించాడు. అలా పరుగెత్తిన భూదేవికి అలుపొచ్చింది. ఇక పారిపోయే శక్తిలేక ఒకచోట నిలబడి, తన దగ్గరకొచ్చిన పృథువుతో "మహారాజా! నన్నేం చేయమంటారు? చెప్పండి" అని వినయంగా ప్రార్థించింది.

పృథువు భూదేవితో "ఓ సువ్రతా! ఈ ప్రపంచం కోరినదంతా వెంటనే ఇవ్వు" అని అడిగాడు. భూదేవి సరేనంది. పృథువు వెంటనే స్వాయంభువ మనువుని దూడగా చేసి భూమి (గోవు) నుంచి పాలు పితికాడు. అలా పితుకగా వచ్చిన పాలని త్రాగి ప్రజలందరూ ఆనందంగా జీవించారు. ఆ తరువాత సోముణ్ణి(చంద్రుణ్ణి)దూడగా చేసి ఋషులందరూ పాలుపితికారు. ఇలా వరుసగా బృహస్పతి, మనువు, యముడు, ధృతరాష్ట్రుడనే నాగుడు, త్రిమూర్ధుడు, యక్షులు, రౌప్యనుడు, వసురుచి, మేరుపర్వతం సాలవృక్షం – ఇలా ఎందరో భూమిని (గోవుని) పిదికారు. తద్వారా ఎన్నో రకాల వస్తువులు లోకంలో ఆవిర్భవించాయి.

పృథురాజ్యంలో ప్రజలందరూ పూర్ణాయుష్కులు. దారిద్ర్యం అన్నమాటే వారెవరికీ తెలియదు. ఎవ్వరికీ అక్కడ ధనాశలేదు. దుఃఖం, శోకం అనేవి కనిపించవు. అంత ధర్మబద్ధంగా పృథువు ప్రజల్ని పాలిస్తున్నాడు. అమిత బలపరాక్రముడైన ఆ మహారాజు తన వింటికొనతో మహాపర్వతాల్ని పైకిలేపి లోకహితం కోసం భూమినంతా ఎగుడు దిగుడుగా ఉన్న దాన్ని చక్కగా చదును చేసాడు. అప్పుడు భూమి పంటలు పండటానికి అనువుగా మారింది. ఆయన రాజ్యంలో ఎవరూ ఆయుధాలు పట్టటం లేదు. వారికా అవసరమే కలగలేదు. శత్రువన్నవాడు లేదు. ప్రజలందరూ ధర్మాన్ని అనుసరించే తమ జీవనాన్ని

కొనసాగిస్తున్నారు. ఆ విధంగా భూమిని పాలించిన పృథుచక్రవర్తికి భూదేవి కూతురుతో సమానంగా వున్నందు వల్ల ఆమెకి పృథివీ అనేపేరు వచ్చింది.

## పితృవంశాల చరిత్ర

స్వర్గలోకంలో ఉండే పితృదేవతలు సాకారులు (ఆకారంతో ఉండేవారు), నిరాకారులు (ఆకారంలేనివారు) అని రెండు రకాలుగా ఉంటారు. వీరిలో సాకారులు నాలుగు రకాలుగా ఉంటే నిరాకారులు మూడు రకాలుగా వున్నారు. వీరంతా ఓజశ్శక్తి సంపన్నులు వైరాజు కుమారులు. దేవగణాలు పూజించే వారినే వైరాజులంటారు. యోగభ్రష్టులైన వారంతా సనాతనమైన లోకాల్ని చేరుకుంటారు. వారంతా బ్రహ్మదేవుడి పగలు పూర్తవగానే దాని చివర బ్రహ్మావాదులై పూర్వజన్మ జ్ఞానాన్ని, యోగాన్ని, సాంఖ్యాన్ని పొంది పునరావృత్తి లేని స్థితిని పొందుతారు. అందుకే శ్రాద్ధాన్ని యోగులకే పెట్టాలి.

**హిమవంతుడి సంతానం :** ఈ వైరాజులకి మానసపుత్రిక మేనకాదేవి. ఈమెనే పర్వతరాజు హిమవంతుడు వివాహం చేసుకున్నాడు. హిమవంతుడి పుత్రుడు మైనాకుడు. ఆ మైనాకుడి పుత్రుడు క్రీంచుడు. అతని పేరు మీదుగానే సప్తద్వీపాలలో ఒకదానికి క్రౌంచద్వీపం అనే పేరు వచ్చింది. పరమనిష్ఠా గరిష్ఠురాలైన హిమవంతుడి భార్య మేనకాదేవి యోగశక్తి సంపన్నులైన ముగ్గురు కుమార్తెల్ని కన్నది. వారే ఉమ–ఏకవర్ణ–అపర్ణ అనేవారు. వారు ముగ్గురూ వరుసగా ఉమ రుద్రుడికి, ఏకవర్ణ భృగుమహర్షికి, అపర్ణ వైగీషవ్యుడికి పత్నులయ్యారు.

**అచ్ఛోద వృత్తాంతం :** ఊర్ధ్వలోకాల్లో సోమపథం అనే లోకాలున్నాయి. ఆ లోకాల్లోనే పితృదేవతలుంటారు. వారిని భావనచేయాలి. యజ్ఞం చేసిన వారిని అగ్నిష్వాత్తులని, క్రవ్యాదుల్ని చేసిన వారిని పితరులని అంటారు. పితృదేవతల్ని ఉద్దేశించి ఇచ్చిన ద్రవ్యాన్ని కవ్యం అని వ్యవహరిస్తారు. పితృదేవతలకి అచ్ఛోదయసుందరి అనే ఆమె కూతురుగా జన్మించింది. పితృదేవతలు ఆమె పేరు మీదగానే అచ్ఛోదనం అనే సరస్సుని ఏర్పరిచారు. అచ్ఛోద వేయి దివ్యసంవత్సరాలు తపస్సు చేయగా, ఆమె తపస్సుకి సంప్రీతులైన పితృదేవతలు

ఆమెకి వరమివ్వటానికి వచ్చారు. వచ్చిన వారంతా దివ్య మాలల్ని, గంధాను లేపనాల్ని ధరించి నవమన్మథాకారులుగా ఉన్నారు. వారిలో 'అమావాస్య' అనే పితృదేవతని చూసి అచ్ఛోద కామభావాన్ని పొందింది. ఆ వ్యభిచార దోషం కారణంగా ఆమె యోగభ్రష్టురాలై భూలోకంలోకి జారిపోయింది.

ఆ విధంగా భూలోకంలోకి జారిపడ్డ అచ్ఛోద అమావాస్య పురుషుడి మీద తనకున్న ప్రేమని విడవలేదు. అమావాస్య పురుషుడు కూడా ఆమెని మోహించాడు. వెంటనే ఆమెని తనలోకానికి తీసుకువెళ్ళాడు. కొన్నాళ్ళు గడిచాక ఆచ్ఛోదకి తానుచేసిన తప్పు తెలిసి వచ్చింది. సిగ్గుతో తలవంచుకుని తిరిగి తనకి తపఃశక్తిని ప్రసాదించమని పితృదేవతల్ని వేడుకుంది. పశ్చాత్తాపపడిన అచ్ఛోదని పితృదేవతలు క్షమించారు.

**వ్యాసావతారం :** మహాత్ములైన పితృదేవతలు అచ్ఛోద ద్వారా రాబోయేకాలంలో ఒక దేవకార్యం జరగబోతోందని తెలుసుకున్నారు. ఆమెతో ఇలా అన్నారు. "అచ్ఛోదా! దివ్యశరీరంతో స్వర్గలోకంలో ఉంటూ ఏ కొంచెం పని చేసినా దాని కర్మఫలం దివ్య శరీరంతోనే అనుభవించబడుతుంది. దేవత్వంతో ఉన్నప్పుడు కర్మఫలాలు అప్పటికప్పుడే పరిపాక దశని పొందుతాయి. ఇక మానుష ఉపాధితో చేసిన కర్మలు చనిపోయిన తరువాత గానీ ఫలించవు. అందువల్ల నీవు కోరినట్టు నీ తపస్సుద్వారా సంపాదించిన పుణ్యఫలాల్ని ఇరవై ఎనిమిదో ద్వాపరంలో అనుభవిస్తావు. ఆ జన్మలో నీవు నీచవంశంలో పుడతావు. పితృదేవతలతో తప్పుచేసిన ఫలితంగా నీవలా జన్మించాల్సి వస్తుంది.

ఓ అచ్ఛోదా! భూలోకంలో నీవు వసురాజు అనేవాడికి కూతురుగా జన్మిస్తావు. కన్యత్వంతోనే నీవు పుణ్యలోకాల్ని పొందుతావు. పరాశరుడి ద్వారా నీకు ఒక కుమారుడు పుడతాడు. బదరీ ద్వీపంలో అతడు జన్మించినందువల్ల అతడు బాదరాయణుడనే పేరుతో వర్ధిల్లుతాడు. ఆ మహాపురుషుడే ఒక్కటిగా వున్న వేదాల్ని నాలుగు భాగాలుగా విభజించటంతో వేదవ్యాసుడని పూజించబడతాడు.

సముద్రవంశంలో పౌరవంశానికి చెందిన శంతనుడు జన్మిస్తాడు. ఆయనకి విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు అనే ఇద్దరు పుత్రులు. వారిద్దర్నీ చూసిన నీవు ఎంతో ఆనందించి ఆ తరువాత 'ప్రోష్టపద్యష్టకా' అనే రూపంతో తిరిగి పితృలోకాన్ని చేరతావు. భూలోకంలో సత్యవతిగా జీవించిన నీవు పితృలోకంలో అష్టకగా వుండి అందిరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాల్ని ప్రసాదిస్తావు. అలాగే భూలోకంలో అచ్ఛోదయ సరస్సుగా రూపొంది జనుల్ని తరింపచేస్తావు" ఈ విధంగా పితృదేవతలు పలికి అక్కణ్ణుంచి అదృశ్యమయ్యారు. వారు చెప్పిన విధంగానే అచ్ఛోద భూలోకంలో సత్యవతిగా జన్మించి శ్రీహరి అవతారుడైన వ్యాసమహర్షిని కని తిరిగి తన పితృలోకానికి చేరుకుంది.

**రెండో పితృగణం :** స్వర్గలోకంలో బర్హిషులతో పాటు గొప్పవర్ఛస్సుతో వెలిగిపోయే విభ్రాజులనే వారు కూడా వున్నారు. వారితో పాటే సువ్రతులనే పితృదేవతలు కూడా అక్కడే కొలువున్నారు. ఆ బర్హిష లోకంలో ఎన్నో దివ్య విమానాలున్నాయి. సంకల్ప మాత్రంతోనే మంచి ఫలాల్ని ప్రసాదించే వృక్షాలున్నాయి. శ్రాద్ధాన్ని శ్రద్ధగా పెట్టినవారు ఆ లోకంలో ఆనందంగా నివసిస్తుంటారు. ఆలోకంలో దానవులు, దేవగణాలు, అలాగే గంధర్వ, అప్సర, యక్ష రక్షో గణాలుకూడా వున్నాయి. భూలోకంలో యజ్ఞయాగాలు చేసిన పులస్త్యుడి పుత్రులు వందలాదిమంది తపో యోగం ద్వారా ఆ లోకాన్ని చేరుకున్నారు. ఆ దివ్య లోకంలో పులస్త్యపుత్రులు మానసపుత్రిక 'పీవరి' అనే కన్య నివసిస్తోంది.

'పీవరి' గొప్ప యోగిని. ఎంతో గొప్ప తపస్సు చేయగా పరమాత్మ ఆమెకి ప్రత్యక్షమయ్యాడు. ఆమె ఆ పరమాత్మకి నమస్కరించి "ప్రభూ! ఇంద్రియనిగ్రహం కలిగినవాడిని, యోగవంతుడైన ఒక ఉత్తముణ్ణి నాకు భర్తగా ప్రసాదించు" అని కోరుకుంది. అప్పుడా పరమాత్మ "పీవరీ! వ్యాసమహర్షి పుత్రుడు శుకమహర్షి! నీవడిగిన లక్షణాలన్నీ అతడికున్నాయి. నీవతడిని వివాహం చేసుకో. మీ ఇద్దరికీ 'కృత్తి' అనే కుమార్తె జన్మిస్తుంది. ఆమె పాంచాలరాజు సాత్వతుడికి భార్య అవుతుంది.

నీ లాగానే యోగసిద్ధాంతపారంగతురాలైన 'కృత్తి' బ్రహ్మదత్తుడనే పుత్రుణ్ణి కంటుంది. అలాగే నీకు శుకుడి ద్వారా కృష్ణుడు, గౌడుడు, శంభువు అనే కుమారులు కూడా జన్మిస్తారు. వీరికి మానస పుత్రికగా 'గోప' అనే కన్య ఉదయిస్తుంది. ఆమె స్వర్గలోకంలో గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తుంది. ఆ 'గోప' సాధ్యులకి పత్నిగా మారి వారి కీర్తిని పెంపొందిస్తుంది. సూర్యమండలంలో హవిర్భాగాలని అందుకునే అంగిరసుడి పుత్రులు ఆ పితృలోకంలో ఉన్నారు. అది పుణ్యతీర్థాలలో శ్రాద్ధాలు పెట్టే క్షత్రియులుండే లోకం. అక్కడున్న వారంతా రాజులకి పితృదేవతలు.

ఈ పితృదేవతలకి మానసపుత్రిక యశోద. ఆమె అంశుమంతుడికి భార్య, పంచజుడికి కోడలు, దిలీపుడి తల్లి, భగీరథుడికి మామ్మ.

**మూడో పితృగణం :** ఇక కోరిన కోరికలు ప్రసాదించే లోకాలు మరికొన్ని ఉన్నాయి. వాటిలో సధన్వులు అనే పితృదేవతలుంటారు. అక్కడే ఆజ్యవములు అనే లోకాలున్నాయి. అవి కర్ధమ ప్రజాపతికి చెందిన లోకాలు. పులహుడి వంశానికి చెందిన వారు ఈ లోకంలో ఉన్నారు. వారంతా వైశ్యులు. శ్రాద్ధం శ్రద్ధగా చేసిన వైశ్యులు. వారందర్నీ ఒక్కసారిగా దర్శిస్తారు. ఈ వైశ్యపితృదేవతల మానస పుత్రిక 'విరజ'. ఈమె నహుషుడి భార్య అవగా వారికి యయాతి చక్రవర్తి జన్మించాడు. తరువాత ఈ విరజ బ్రహ్మలోకానికి చేరుకుని అక్కడ 'అష్టక'గా మారింది.

**నాలుగో పితృగణం :** బ్రహ్మలోకానికి పైన 'సుమనో' అనే లోకాలున్నాయి. ఇందులో 'సోమవులు' అనే పేరుతో పితృదేవతలు శాశ్వతంగా నివసిస్తుంటారు. వారంతా ధర్మమూర్తులు. బ్రహ్మ కన్నా పైనున్నవారు. ప్రళయకాలంలో ఈ యోగులందరూ బ్రహ్మలో లీనమై తిరిగి ఆవిర్భవిస్తుంటారు.

ఈ పితృదేవతల మానసపుత్రిక "నర్మదానది". పశ్చిమ సముద్రంలో కలిసే ఈ పవిత్రనది భూమండలాన్నంతా పవిత్రం చేస్తుంది. "ఓ పీవరీ!" ఈ పితృదేవతల అనుగ్రహంతోనే మానవులందరూ సృష్టించబడ్డారు.

వారి అనుగ్రహం శ్రాద్ధం పెట్టిన వాడిమీద ఎప్పుడూ ఉంటుంది. ఆది సర్గలో ఉన్న పితృదేవతల కోసమే శ్రాద్ధవిధి నిర్దేశించబడింది. కనుక శ్రద్ధగా శ్రాద్ధం పెట్టినవాడికి పితృదేవతల అనుగ్రహంతో ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయి" అని పీవరికి బోధించి పరమాత్మ అదృశ్యమయ్యాడు.

## కర్ణ-అర్జునుల జన్మవృత్తాంతం

పూర్వం బ్రహ్మదేవుడు శివుణ్ణి చూసి తన అయిదో తలతో హేళనగా నవ్వగా అందుకు కోపం వచ్చిన శివుడు తన గోటితో ఆయన తలని తెంచేశాడు. దానితో బ్రహ్మకి కోపం వచ్చినుదుటి మీద చెమట పట్టింది. ఆయన ఆ చెమటని తీసి ఒక్కసారి ఆగ్రహంతో నేలపై విసిరికొట్టాడు. నేలపై పడిన వెంటనే ఆ చెమట నుంచి విల్లు, అమ్ముల పొది, వేయికవచాలు ధరించిన కింకరుడు ఆవిర్భవించాడు. బ్రహ్మ అతణ్ణి చూసి ఇదుగో ఈ రుద్రుడు దుర్మార్గుడు ఇతన్ని చంపు అని ఆజ్ఞాపించాడు. మహాభీకరంగా వున్న ఆ కింకరుణ్ణి చూసి రుద్రుడు పరుగెత్తగా కింకరుడు వెంటనే ఆయన్ని పట్టుకోవాలని వెంబడించాడు.

అలా కింకరుణ్ణి తప్పించుకోవాలని పరుగెడుతున్న రుద్రుడు సరాసరి వైకుంఠానికి వచ్చి శ్రీహరిని శరణువేడాడు. విష్ణువు ఆయనకి అభయమిచ్చి రుద్రుణ్ణి తరుముతూ వచ్చిన సహస్రకవచుణ్ణి చూసి ఒక్కసారి గట్టిగా హుంకరించాడు. అది విని తట్టుకోలేక ఆ సహస్రకవచుడు మూర్ఛపోయాడు. అప్పుడు శ్రీహరి శంకరుణ్ణి పిలిచి 'శంకరా! నీకేం కావాలో కోరుకో' అని అడగగా శంకరుడు వెంటనే తన చేతిలోని కపాలాన్ని చాచి శ్రీహరీ! నాకు భిక్షని ప్రసాదించు అని కోరాడు. అది చూసి ఇంతకంటే భిక్ష ఇవ్వటానికి తగినవాడెవడు? అని భావించిన శ్రీహరి తన కుడి చేతిని ముందుకి చాపాడు. శంకరుడు వెంటనే తన శూలంతో ఆయన చేతిని ఖండించాడు.

శ్రీహరి భుజం నుంచి రక్తం ధారలుగా కారటం మొదలయ్యింది. మహాభీకరంగా అగ్ని జ్వాలలా ఉన్న ఆ రక్తధార ఏభైయోజనాల నిడివితో వచ్చి సరాసరి శంకరుడి చేతిలో వున్న కపాలంలోకి పడింది. అలా ఆ రక్తధార

వెయ్యి దివ్య వర్షాల పాటు ఆ కపాలంలో పడుతూనే ఉంది. అంతకాలం శంకరుడు ఆ రక్తాన్నే భిక్షగా స్వీకరిస్తున్నాడు. ఒకనాడు శ్రీహరి "శంకరా! నీ భిక్షా పాత్ర నిండిందా" అని అడిగాడు. ఆ మాట విని శంకరుడు తన చేతి వేళ్ళని కపాలంలో ముంచి 'శ్రీహరీ! కపాలం నిండింది' అని సమాధానమిచ్చాడు.

శ్రీహరి చూస్తుండగా శంకరుడు కపాలంలో ఉన్న రక్తంలో తన వేళ్ళని ఉంచి వెయ్యి దివ్యసంవత్సరాలు దాన్ని మథించాడు. అప్పుడు ఆ రక్తంలోనించి నురుగులు, బుడగలు బైటికి వెలువడ్డాయి. కొద్దిసేపటికి ఆ రక్తం కిరీటాన్ని ధరించి, చేతిలో విల్లు, వీపుమీద అమ్ములపొది ఉంచుకుని ఒక మహాపురుషుడు కనిపించాడు. శ్రీహరి ఆశ్చర్యంగా అతణ్ణి చూసి వీడెవడయ్యా అని శంకరుణ్ణి అడిగాడు. "శ్రీహరీ! ఇతడు నరుడు" రాబోయే కాలంలో నారాయణుడవైన నీకు మిత్రుడై అసురసంహారం చేయటంలో తోడ్పడతాడు. నరనారాయణులుగా మీరు లోకంలో ప్రసిద్ధి చెందుతారు. ఈ నరుడు సర్వ విజయుడు. బ్రహ్మతేజస్సు, నీ చేతి నుంచి కారిన రక్తం, నా దృష్టినుంచి ఆవిర్భవించిన తేజస్సు ఈ మూడూ కలిసి జన్మించిన ఈ నరుడు శత్రువుల్ని అవలీలగా జయిస్తాడు. ఇతన్ని ఇంద్రాది దేవతలు కూడా జయించలేరు" అని శంకరుడు చెప్పగానే అది విని శ్రీహరి ఎంతో ఆశ్చర్యపోయాడు.

కపాలంలోనే ఉన్న ఆ మహావీరుడు తననే చూస్తూ ఆశ్చర్యపోతున్న హరిహరుల్ని చూసి నమస్కరించి "ప్రభూ! నేనేం చేయాలో ఆజ్ఞాపించండి" అని అడిగాడు. శ్రీహరి వెంటనే అతన్ని కపాలంలో నుంచి బైటికి లాగాడు. కపాలంనుంచి బైటపడి నుంచున్న నరుడితో "ఇదిగో ఇక్కడ మూర్ఛపోయి కనిపిస్తున్నాడే వీడు మహాభయంకరుడు. బ్రహ్మదేవుడి చెమట నుంచి పుట్టాడు. వీడికి వెయ్యి కవచాలున్నాయి. నా హుంకారంతో ఇలా మూర్ఛపోయాడు. వెంటనే వీణ్ణి మేల్కొల్పి వాడి అంతుచూడు" అని చెప్పి శ్రీహరి శంకరులిద్దరూ అదృశ్యులయ్యారు.

నరుడు శ్రీహరి చెప్పినట్టుగానే మూర్ఛపోయిన సహస్రకవచుణ్ణి నిద్రలేపాడు. ఇద్దరికీ మధ్య యుద్ధం ప్రారంభమయ్యింది. వారిద్దరి ధనుష్ఠంకారాల